జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 6 పక్షపత్రిక మార్చి 16-31, 2016






# ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ప్రజారోగ్య అవార్డులు 2016

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ప్రజారోగ్య కార్యక్రమ విజేతలకు పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్, ఇండియా అధ్యక్షుడు డా॥ శ్రీనాథ్ రెడ్డి, ఇతర జ్యూరీ సభ్యులతో కలిసి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇటీవల హైదరాబాద్‌లో అవార్డులను అందచేశారు. సమర్థవంతంగా ఆరోగ్యకార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల విభాగంలో ఛత్తీస్‌గఢ్‌కి, ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో వైద్య విద్య, పరిశోధన పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్‌స్టిట్యూట్, చండీగఢ్‌తోపాటు ఢిల్లీ ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఢిల్లీకి, సామాజిక బాధ్యతగా వైద్య సేవలందించిన ప్రయివేటు సంస్థల విభాగంలో అరవింద్‌ల ఐ కేర్ సిస్టం, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, శంకర నేత్రాలయకు పురస్కారాలు లభించాయి.



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మార్చి 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 6

## లోపలి పేజీల్లో...

యథాస్థితిని కొనసాగించేదేతప్ప................. 5
కేంద్రబడ్జెట్ 2016-17............................ 6
మార్పు రూట్‌లో రైల్వే బడ్జెట్ 2016............. 8
సంస్కరణలు, విద్య-ఆరోగ్యంపై మరిన్ని.......... 10
ప్రయివేటు చికిత్స ఖర్చు 4 రెట్లు ఎక్కువ........... 12
భజన్‌లాల్ 2.0 లు.................................. 13
ఫిరాయింపుల చట్టంతో ప్రజాస్వామ్యం.......... 16
కావలిలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయం......... 19
సొసైటీలో మోసపోయినవారిని ఆదుకోవాలి.. 20
కౌలు రైతు చట్టం అమలు చేయాలి.............. 21
సేంద్రియ సాగుకి కేంద్ర ప్రభుత్వ భారీ........... 22
పల్లె వలసల పాపం పాలకులదే.................. 23
సిటిజన్ ఆఫ్ ద ఇయర్ గా లోక్‌సత్తా నేత........ 26
పురుషాధిక్య మతపెద్దల వల్లే మహిళల పట్ల...... 27
మహిళల ప్రాతినిధ్యానికి ప్రత్యామ్నాయ .......... 28
పుట్టుకతో వృద్ధులకు కన్నయ్య సవాల్............. 32
ఏపీ రాజధాని భూదందాపై భారీ ఆరోపణలు.... 33
చంద్రబాబు అమరావతి కేంద్రీకరణ అవినీతి..... 34


### సంపాదక వర్గం


**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి






# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# యథాస్థితిని కొనసాగించేదేతప్ప జనం సామర్థ్యాన్ని వెలికితీసేది కాదు : కేంద్ర బడ్జెట్ 2016-17పై జేపీ

"యథాస్థితిని కొనసాగించే బడ్జెట్టే తప్ప మార్పుని తేగలిగేది కాదు. నిజమైన గొప్ప భారతదేశానికి పునాది వేయగల నాణ్యమైన విద్య, అందరికీ ఆరోగ్యం, పటిష్టమైన చట్టబద్ధపాలన, తేలిగ్గా అందరికీ న్యాయం వంటి కీలకాంశాలను మరోమారు విస్మరించారు. 80శాతం మంది ప్రజల ఉత్పాదక శక్తిసామర్థ్యాలను వెలికితీయ గలిగినప్పుడే మనం గొప్పస్థాయిని అందుకో గలం" అని కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వ్యాఖ్యానించారు.



ఆర్థికమంత్రి అరుణజైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ 2016-17పై జేపీ స్పందిస్తూ, ఆర్థిక క్రమశిక్షణ, మౌలికవసతులపై వ్యయాన్ని కొంత పెంచటం, ప్రభుత్వ బ్యాంకుల పునరుజ్జీవనానికి అరకొర ఏర్పాటుతో మధ్యకాలిక రోడ్‌మ్యాపులా ఈ బడ్జెట్ ఉందన్నారు. బడ్జెట్లపై మితిమీరిన హడావుడి పాత లైసెన్స్ రాజ్ అవశేషమని, ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనావేసి చర్యలు చేపట్టటం, స్థిరత్వం ఈవేళ్టి ఆర్థిక సూత్రాలని అన్నారు. బడ్జెట్‌ను అతిగా ఊహించుకోనక్కర్లేదన్నారు.


స్థానిక ప్రభుత్వాలకు 14వ ఆర్థిక సంఘం చేసిన కేటాయించిన నిధులకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపటం హర్షణీయమని, అయితే ఆ కేటాయింపు చాలా స్వల్పమని జేపీ అన్నారు. స్థానిక అవసరాలపై స్థానిక ప్రజల నిర్ణయాలు ఉన్నప్పుడే నిధులు సక్రమంగా ఖర్చవుతాయన్నారు. స్థానిక ప్రజల చేతిలో అధికారాలు, నిధులు ఉంటే, వృధా సబ్సిడీల ఖర్చు కూడా తగ్గుతుందని, వనరుల్ని ఉత్పాదకరంగాలకి ప్రజలే కేటాయించుకుంటారని జేపీ అన్నారు. ఉన్న పరిమిత నిధుల్ని ఏరకంగా ఖర్చు చేస్తే ఎక్కువ ఫలితాలు వస్తాయో స్థానిక ప్రజలు మాత్రమే సరిగా అంచనా వేయగలుగుతారన్నారు.

బలమైన స్థానిక ప్రభుత్వాలతో మూడో అంచె ఫెడరలిజం, విద్య, ఆరోగ్య ప్రమాణాలపై, చట్టబద్ధపాలనపై శక్తియుక్తులను కేంద్రీకరించటం ద్వారా మాత్రమే ఈదేశంలో నిజమైన మార్పు సాధ్యమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# వార్షిక బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌ని అవమానించిన కేంద్రం, మంత్రులచేత చంద్రబాబు రాజీనామా చేయించాలి : లోక్‌సత్తా

రైల్వే బడ్జెట్‌లోలాగే 2016-17 సాధారణ వార్షిక బడ్జెట్‌లో కూడా కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర అన్యాయం చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసమర్థత వల్లే రాష్ట్ర ప్రజల్ని కేంద్రం గడ్డిపూచలా తీసిపారేస్తోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. కేంద్రం ప్రత్యేక హోదా పన్ను రాయితీల్ని ప్రకటిస్తే పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువతకఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చిన ప్రత్యేక హోదాపై, చట్టంలో పొందుపరిచిన పోలవరం ప్రాజెక్టుపై, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై బడ్జెట్‌ల తీరు చూస్తే కన్నీరు వస్తుందన్నారు. రూ. 20,000-30,000 కోట్ల బహుళార్థసాధక ప్రాజెక్టు పోలవరానికి రూ. 100 కోట్లు, విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయానికి రూ. 1కోటి, విశాఖపట్నం మెట్రో రైలు సర్వేకి చెప్పుకోవటానికే సిగ్గుచేటైన మొత్తం కేటాయించటం ఆంధ్రులను అవమానించటమేనన్నారు. ఎన్నికలయ్యాక ఏరుదాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరిస్తూ తెలుగు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నవారు మూల్యం చెల్లించకతప్పదన్నారు. రాష్ట్ర ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని, చంద్రబాబు తన పార్టీ మంత్రుల చేత తక్షణం రాజీనామా చేయించాలని భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు.

# కేంద్ర బడ్జెట్ 2016-17




| | 2014 -15 వాస్తవ గణాంకాలు | 2015 -16 బడ్జెట్ అంచనాలు | 2015 -16 సవరించిన అంచనాలు | 2016 -17 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 11,01,472 | 11,41,575 | 12,06,084 | 13,77,022 |
| మూలధన వసూళ్లు | 5,62,201 | 6,35,902 | 5,79,307 | 6,01,038 |
| మొత్తం వసూళ్లు | 16,63,673 | 17,77,477 | 17,85,391 | 19,78,060 |
| ప్రణాళికేతర వ్యయం | 12,01,029 | 13,12,200 | 13,08,194 | 14,28,050 |
| ప్రణాళికా వ్యయం | 4,62,644 | 4,65,277 | 4,77,197 | 5,50,010 |
| మొత్తం వ్యయం | 16,63,673 | 17,77,477 | 17,85,391 | 19,78,060 |
| రెవెన్యూ లోటు | 3,65,519 | 3,94,472 | 3,41,589 | 3,54,015 |
| ద్రవ్య లోటు | 5,10,725 | 5,55,649 | 5,35,090 | 5,33,904 |
| ప్రాథమిక లోటు | 1,08,281 | 99,504 | 92,469 | 41,234 |

ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైటీ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకి కొంత పెద్దపీట వేసింది. వసతులతో అక్కడి ఆదాయమార్గాలను పెంచేందుకు రూ. 1.77 లక్షల కోట్ల నిధుల్ని కేటాయించింది. మరింత మెరుగైన భారత్‌ను ఆవిష్కరించేందుకు తొమ్మిడి స్తంభాలను ఆలంబనగా ప్రకటించారు. పారిశ్రామికవేత్తలు కోరుకున్న సంస్కరణల దూకుడును కేవలం మాటల్లో ప్రదర్శించారు. పన్ను వివాదాలకు 'ఒకేసారి పరిష్కారం' వంటి మినహాయింపుల్ని ప్రకటించారు.

వ్యక్తిగత, కార్పొరేట్ ఆదాయపు పన్ను అంచెల్లో ఎలాంటి మార్పులూ చేయలేదు. రూ. 5లక్షల లోపు ఆదాయమున్న చిరుద్యోగులకు రిటర్నుల సమర్పణకు ప్రతిఫలంగా అదనంగా మరో రూ. 3వేల ఆదాయపు పన్ను రాయితీ ఇచ్చారు. ఇప్పుడు రూ. రెండువేల రాయితీ ఉంది. అద్దె భత్యం వర్తించని ఉద్యోగులకు రూ. 60వేల వరకు అద్దె కింద మినహాయింపు ఇచ్చారు. ఈ రెండు రాయితీలతో ప్రస్తుత బడ్జెట్‌లో ఒక వ్యక్తికి సిద్ధించే అవకాశం ఉన్న గరిష్ట ప్రయోజనం రూ. 6,600. మరోపక్క రూ. కోటికి పైబడి ఆదాయం వచ్చేవారికి మరో 3శాతం (మొత్తం 15శాతం) సర్‌ఛార్జి విధించారు. దాదాపు అన్ని రకాల కార్లపై కాలుష్యం పన్ను వేశారు. విలాసకార్లకు గరిష్టంగా 2.5శాతం వేశారు.

దేశీయ నల్లధనం వెల్లడించేందుకు జైట్లీ ధనవంతులకు 45శాతం అపరాధ రుసుముతో మరోమారు అవకాశం ఇచ్చారు. ఇందులో 30శాతం పన్ను. 7.5శాతం అపరాధ రుసుము. మరో 7.5శాతం మొత్తాన్ని 'కృషి కళ్యాణ్' సర్‌ఛార్జి పేరుతో వ్యవసాయరంగ అభివృద్ధికి ఉపయోగిస్తారు. ఈ ఆదాయానికి లెక్కలు అడగరు. విదేశాల్లో దాచిన నల్లధనం అయితే 60శాతం పన్ను కట్టాలి. రైతుల కోసం శీతల గిడ్డంగుల వ్యవస్థలు నిర్మించేందుకు దేశంలోని అన్ని సేవలపై అరశాతం 'కృషి కళ్యాణ్' సెస్ వేశారు. దాంతో పన్ను వర్తించే అన్ని రకాల సేవల ధరలు స్వల్పంగా పెరగనున్నాయి. ఈపీఎఫ్, ఇతర భవిష్యనిధి, పెన్షన్‌నిధి ఖాతాలకు 2016 ఏప్రిల్ 1 తర్వాత జమ అయ్యే మొత్తాలలో 60శాతం సొమ్ముపై విత్‌డ్రాయల్ సమయంలో పన్నువేయాలని ఆర్థికమంత్రి ప్రతిపాదించారు. ఇలాంటి ఇతర పథకాలకు వందశాతం పన్ను ఉన్నందున సమాన అవకాశాల పేరుతో ఈపీఎఫ్‌కు కూడా పన్ను ప్రతిపాదించారు. గృహరుణం వడ్డీపై పన్ను రాయితీని రెండున్నర లక్షలకు (కొత్తగా రూ. 50వేలు) పెంచారు. ఇంటి విలువ రూ. 50లక్షలకు, రుణం విలువ రూ. 35 లక్షలకు మించకూడదని పరిమితి విధించారు. ఆర్థికమాంద్యం ప్రపంచమంతా అలముకున్నా ఎగుమతి ఆధార పరిశ్రమలకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదు. ద్రవ్యలోటును తగ్గించే కార్యక్రమానికి కట్టుబడుతూనే ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి నూతన విధానం ప్రకటించారు.

మేకిన్ ఇండియాకు ఊపునిచ్చేందుకు స్టార్టప్‌లకు వచ్చే ఐదేళ్లలో మూడేళ్లపాటు వందశాతం పన్ను మినహాయింపు ప్రకటించారు. పొగాకు ఉత్పత్తుల అమ్మకాలను నీరుగార్చేందుకు

ఎక్సయిజ్ పన్నును 10శాతం నుంచి 15శాతానికి పెంచారు. చిరుద్యోగులకు ఇచ్చే రాయితీ వల్ల ప్రత్యక్ష పన్నుల ఆదాయం రూ. 1060 కోట్లు తగ్గుతున్నా పరోక్ష పన్నుల ఆదాయం పెరగటంతో రూ. 19,610 కోట్లు అదనపు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఆర్థిక మందగమన పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వ ఖర్చును 15. 3శాతం పెంచుతున్నట్టు ప్రకటించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 19.78 లక్షల కోట్లు ఖర్చు పెడతారు. అందులో ప్రణాళికావ్యయం 5.5లక్షల కోట్లు. మొత్తం బడ్జెట్‌లో రూ. 1.62లక్షల కోట్లు రక్షణరంగానికే కేటాయించారు. అప్పులపై వడ్డీ చెల్లింపుల భారం రూ. 4.42 లక్షల కోట్ల నుంచి 4.92లక్షల కోట్లకు (బడ్జెట్లో నాలుగోవంతు) పెరిగింది. సబ్సిడీల భారం కాస్త తగ్గి రెండున్నర లక్షల కోట్లకు తగ్గింది.

రాయితీలను ఎత్తివేస్తూ కార్పొరేట్ పన్నును 30శాతం నుంచి 25శాతానికి క్రమంగా తగ్గిస్తామని గత బడ్జెట్‌లో ఇచ్చిన హామీని జైట్లీ ప్రస్తావించారు. కొత్తగా పెట్టే యూనిట్లకు ఎలాంటి పన్ను రాయితీలు అడగకుండా ఉంటే 25శాతం పన్ను రాయితీని ఇప్పుడే వర్తింప చేయటానికి సిద్ధమని చెప్పారు. దీర్ఘకాలిక మూలధన లాభాల స్వీకరణ పన్ను వర్తించకుండా ఉండే పరిమితిని 3ఏళ్ల నుంచి 2 ఏళ్లకు తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. ఏడాదికి పదిలక్షలకు మించి డివిడెండ్ అందుకునే వ్యక్తులకు, కుటుంబాలకు పదిశాతం అదనంగా పన్ను వేయాలని, ఈ మొత్తాన్ని వ్యవసాయ రంగానికి వెచ్చించాలని ప్రతిపాదించారు. బ్యాంకులు, బీమా సంస్థలు దివాలా పరిస్థితిని ఎదుర్కోకుండా నివారించేందుకు సమగ్ర ప్రవర్తనా నియమావళిని చట్టరూపంలో తెస్తామన్నారు. అక్రమ డిపాజిట్ల నిరోధానికి కూడా చట్టం తీసుకొస్తామన్నారు.

ఆరోగ్య భద్రత పథకం కింద కుటుంబానికి రూ. 1లక్ష వరకు కవరేజీ వర్తించేట్టు చూస్తామని ఆర్థికమంత్రి ప్రకటించారు. భారత్‌లో ఆహారపదార్థాల ఉత్పత్తి, మార్కెటింగ్‌లో 100శాతం ఎఫ్‌డీఐకి అనుమతి ఇవ్వనున్నట్టు తెలిపారు. (గతంలో ఇదే బీజేపీ ఎఫ్‌డీఐలను వ్యతిరేకించిన సంగతి తెలిసిందే) చిన్న దుకాణాలు వారమంతా తెరిచి ఉంచే వెసులుబాటు కల్పిస్తామన్నారు. 2018 మే నెల నాటికి 100 శాతం గ్రామాలలో విద్యుదీకరణ పూర్తి చేస్తామన్నారు. ఆధార్‌కి చట్టబద్ధత కల్పించేందుకు ప్రయత్నిస్తామని ఆర్థికమంత్రి తెలిపారు.

**తెలుగు రాష్ట్రాలకు నిరాశ**


కేంద్ర 2015 బడ్జెట్ నుంచి కొండంత ఆశించిన తెలుగు రాష్ట్రాలకు గోరంత సాయమే అందింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం ఇచ్చిన హామీల్లో కీలకమైన రెవిన్యూ లోటు భర్తీ, వెనకబడిన జిల్లాలకు నిధులు, పోలవరం, రాజధానికి నిధులు, ప్రత్యేక హోదా లేదా ఆ స్థాయిలో పన్ను రాయితీలు వంటివాటికేమీ బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. రూ. వంద కోట్ల నుంచి రూ. 1లక్ష వరకు విదిలింపులు చేశారు. తెలంగాణరాష్ట్రం మిషన్ భగీరథ, కాకతీయ, రెండు పడకల ఇళ్ల నిర్మాణం వంటి భారీ పథకాలకు ప్రత్యేక ప్యాకేజీ కోరినా బడ్జెట్‌లో స్పందించలేదు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు స్థానంలో చేపట్టిన కాళేశ్వరానికి జాతీయహోదా ఇవ్వాలని అభ్యర్థించినా కేటాయింపులు లేవు. నిధుల్ని విదిల్చి కొత్తగా స్థాపించే పరిశ్రమలకు వడ్డీరాయితీకి మాత్రం అనుమతించారు.

**వ్యవసాయ కేటాయింపులో అంకెల గారడీ**

వ్యవసాయానికి ఈసారి బడ్జెట్‌లో భారీగా ప్రాధాన్యత లభించినట్టు ప్రచారం జరుగుతున్నా, అందులో వాస్తవం లేదని విశ్లేషణలు తెలుస్తున్నాయి. వ్యవసాయానికి కేటాయించిన రూ. 36,000 (మొత్తం బడ్జెట్‌లో 1.8శాతం)లో 15,000 కోట్లు వడ్డీ రాయితీలకు సంబంధించినది. ఇది ఆర్థిక సర్వీసుల శాఖ వద్దులో అంశం. దీన్ని చాకచక్యంగా వ్యవసాయ కేటాయింపుల్లోకి చేర్చారు. ఇది తీసేస్తే నికరంగా వ్యవసాయానికి కేటాయించింది రూ. 21,000 కోట్లే. అంటే గత బడ్జెట్లలో కంటే కూడా తక్కువే. ఇక రైతుల భద్రతకు, వ్యవసాయ మనుగడకు కీలకమైన పరపతి విషయంలో కూడా ఏమాత్రం రైతు ప్రయోజనం దిశగా సంస్కరణలు లేకుండా బడ్జెట్‌లో వ్యవహరించారు. దేశ జనాభాలో ఎక్కువ శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగంలో ఉన్నవారిలో అత్యధికం చిన్న, సన్నకారు రైతులే అయినా, ప్రభుత్వ పరపతి వ్యవస్థ పెద్దరైతులకే మేలు చేసేలా ఉంది. 1990లో మనదేశంలో రెండు లక్షల రూపాయలలోపు రుణం తీసుకున్నవారు 92.2శాతం కాగా, 2011 నాటికి అది 48శాతానికి పడిపోయింది. రుణపాశంలో చిక్కుకుని రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఈ వైఫల్యాన్ని లోతుగా పరిశీలించి సరిదిద్దే ప్రయత్నం బడ్జెట్‌లో చేయలేదు. అరకొరగా ఉన్న పంటల బీమా పథకాన్ని సర్వరోగ నివారిణిలా ప్రచారం చేస్తూ రూ. 5,500 కోట్లు కేటాయించారు.

# మార్పు రూట్‌లో రైల్వే బడ్జెట్ 2016

ప్రయాణికులపై, సరకు రవాణాపై కొత్తగా భారం మోపకుండా సురేష్ ప్రభు తన రెండవ రైల్వే బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రయాణికుల పట్ల గౌరవం, రైళ్ల వేగం, జాతి ప్రగతి తన బడ్జెట్ ప్రధాన ఇతివృత్తమన్నారు. ఖర్చులు తగ్గించుకోవటం, కొత్త ఆదాయమార్గాలను అన్వేషించటం ద్వారా ప్రజలపై భారం తగ్గించే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. ఇప్పటికే ఉన్న సవాళ్లను అధిగమించటం, రైల్వేల పునర్వ్యవస్థీకరణ, పునర్నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. సామర్థ్యం పెంపుపై దృష్టి పెట్టారు. 2019కల్లా తూర్పు-పశ్చిమ, ఉత్తర-దక్షిణ, తూర్పుతీర ప్రత్యేక సరకు రవాణా రైలు మార్గాలను నిర్మిస్తామని ప్రకటించారు. సంబంధిత కాంట్రాక్టులను మార్చి 31నాటికి ఖరారుచేస్తామన్నారు. ఇతర రవాణామార్గాల ధరలతో బేరీజు వేసి రైల్వేల సరకు రవాణా ధరలను సమీక్షిస్తామన్నారు.




| రూపాయి రాక | |
|---|---|
| 1 సరకు రవాణా | 65.6 పైసలు |
| 2 ప్రయాణ ఛార్జీలు | 26.1 పైసలు |
| 3 వివిధ మార్గాల రూపంలో | 3.1 పైసలు |
| 4 కోచ్‌ల ద్వారా అదనపు ఆదాయం | 2.5 పైసలు |
| 5 ఇతరాలు | 2.7 పైసలు |

| రూపాయి పోక | |
|---|---|
| 1 ఉద్యోగుల జీతభత్యాలు | 29.7 పైసలు |
| 2 పింఛను | 18.2 పైసలు |
| 3 ఇంధనం | 17.8 పైసలు |
| 4 డివిడెండ్ | 5.7 పైసలు |
| 5 తరుగుదల రిజర్వు నిధి | 4.8 పైసలు |
| 6 అద్దెలు | 4.4 పైసలు |
| 7 మూలధన నిధి | 3.9 పైసలు |
| 8 స్టోర్లు | 3.1 పైసలు |
| 9 అభివృద్ధి నిధి | 0.9 పైసలు |
| 10 రుణ సేవల నిధి | 0.04 పైసలు |
| 11 ఇతర ఖర్చులు | 8.86 పైసలు |

## రైల్వేని గాడిలో పెట్టేందుకు ప్రయత్నించిన బడ్జెట్

### విశాఖ రైల్వే జోన్‌పై మోదీ, వెంకయ్య, చంద్రబాబు సమాధానం చెప్పాలి: లోక్‌సత్తా

వరాల జల్లు కురిపించకపోయినా, ఒక మార్పు కోసం ప్రయత్నిస్తూ దేశ రైల్వేరంగాన్ని గాడిలో పెట్టేందుకు 2016-17 బడ్జెట్‌లో రైల్వే మంత్రి సురేష్ ప్రభు ప్రయత్నించారని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది.


సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేకుండా ప్రాజెక్టులను ప్రకటించటం, వాటిని పూర్తి చేయకపోవటం, తర్వాతి బడ్జెట్‌లో వాటి కోసం రాజకీయ పార్టీలు ఆందోళనలకు దిగటం ఇప్పటిదాకా ఆనవాయితీకి వస్తోందని, దీనికి భిన్నంగా ఆచరణసాధ్యమైన రీతిలో ప్రాజెక్టులను తీసుకుని పూర్తి చేయటానికి తాజా బడ్జెట్ ప్రాధాన్యత నిచ్చిందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు.

రైల్వే సేవల్లో సాంకేతికత వినియోగం సాధారణ పాలనాంశమని, దాన్ని సంస్కరణగా భావించకుండా ప్రాజెక్టుల పూర్తి, సామాన్య ప్రజలకు సేవలందించటంపై రైల్వే మంత్రి తన మాటల్ని చేతల్లో చూపాలని, నిబద్ధతతో, బాధ్యతతో హామీల్ని నెరవేర్చాలని బాబ్జీ అన్నారు. దీర్ఘకాలిక ప్రాజెక్టులను చెప్పిన సమయానికి పూర్తి చేయటానికి గరిష్ఠ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

రైలు ప్రయాణంలో ప్రజలకు అనేక సౌకర్యాలను మంత్రి హామీ ఇవ్వటం అభినందనీయమేగానీ, రైల్వేలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీ ఉండగా వాటన్నిటినీ అందించటం ఎలా సాధ్యమని బాబ్జీ ప్రశ్నించారు. ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించటానికి రైల్వేశాఖలో తగినన్ని నియామకాలను వెంటనే పూర్తి చేయాలని, ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన పరిస్థితులను కల్పించాలని డిమాండ్ చేశారు.


విశాఖపట్నం రైల్వే జోన్‌ను ప్రకటించకపోవటాన్ని బాబ్జీ తీవ్రంగా తప్పుపట్టారు. విశాఖ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీజేపీ మంత్రులు, ఎంపీలు పలుమార్లు చెప్పారని, రాష్ట్ర విభజన సమయంలో ఇది కీలకాంశమని, అయినా జోన్ ఏర్పాటు చేయకపోవటం ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని వంచించటమేనని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు, చంద్రబాబు నాయుడు దీనిపై ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని, విశాఖ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయకపోతే వీరు తగిన మూల్యం చెల్లించకతప్పదని భీశెట్టి బాబ్జీ హెచ్చరించారు.

ప్రయాణంలో నాణ్యతను పెంచేందుకు కొత్తగా మూడు రకాల సూపర్ ఫాస్ట్ రైళ్లను ప్రవేశపెట్టారు. 1) హమ్‌సఫర్. ఇది మొత్తం థర్డ్ ఏసీ బోగీలతో భోజన సదుపాయంతో నడిచే రైలు. 2) తేజస్. ఇది వైఫై వంటి అత్యాధునిక సేవలతో, వినోదం, స్థానిక వంటకాల హంగులతో 130 కిలోమీటర్ల వేగంతో నడిచే రైలు. 3) ఉదయ్. రాత్రి బయల్దేరి ఉదయంకల్లా గమ్యం చేర్చే డబుల్ డెక్కర్ ఏసీ రైలు. అత్యంత రద్దీ మార్గాలలో ప్రవేశపెడతారు. ఇవికాక రిజర్వేషన్ లేని ప్రయాణికుల అగచాట్లను తీర్చేందుకు అంత్యోదయ సూపర్‌ఫాస్ట్ రైళ్లను ప్రకటించారు. ముఖ్యమైన రైళ్లన్నంటికీ రిజర్వేషన్‌లేని ప్రయాణికుల కోసం తాగునీరు, మొబైల్ ఛార్జింగ్ సదుపాయం ఉండే దీన్ దయాళు బోగీలను తగిలిస్తారు. 2015-16 అంచనాలకు 20శాతం పెంపుతో తాజా బడ్జెట్‌లో రూ. 1.21 లక్షల కోట్ల పెట్టుబడులను (ప్రణాళికా వ్యయం) ప్రతిపాదించిన మంత్రి ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయటమే తన లక్ష్యమంటూ కొత్త ప్రాజెక్టులకు దూరంగా ఉన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూడా లక్ష్యాలను పరిమితం చేసుకున్నారు. "ఇది అత్యంత సవాళ్లతో కూడిన సందర్భం. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో దేశీయ కీలక రంగాలలో వృద్ధిరేటు మందగించింది. దీనికితోడు ఏడవ వేతన సంఘం ఖర్చులు భయపెడుతున్నాయి. బోనస్ చెల్లింపులు భయపెడుతున్నాయి. అయినా ప్రజాప్రయోజనాలు కాపాడేందుకే ప్రయత్నించాం" అని సురేష్ ప్రభు వివరించారు. ప్రయాణికులు, సరకు రవాణా నుంచి ఆదాయం తగ్గటంతో ఒత్తిడి పెరిగిందన్నారు. సరకు రవాణా వాణిజ్యాన్ని పెంచుకోవాలని, జనంపై భారం మోపకుండానే స్టేషన్లను అభివృద్ధి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. సరకు రవాణా విస్తృతిని పెంచుకోవటంతోపాటు పోయిన మార్కెట్‌ను తిరిగి సాధించుకోవాల్సుందన్నారు. రైల్వే వ్యవస్థలో అన్నిరకాల ధరలను నిష్పాక్షికంగా నిర్ధారించేందుకు 'రైల్వే అభివృద్ధి ప్రాధికార సంస్థ'ను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 90శాతం ఖర్చులను రాబట్టుకోగలిగామని, ఏడవ వేతన సంఘం భారం ఉన్నా కూడా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 92శాతం ఖర్చులను రాబట్టుకోగలమని ధీమా వ్యక్తం చేశారు. తీవ్రమైన పొదుపు చర్యలు, తక్కువ రేటుతో కుదుర్చుకున్న దీర్ఘకాలిక విద్యుత్తు ఒప్పందాలు రైల్వే ఆదాయాన్ని మెరుగుపరిచాయన్నారు. వచ్చే ఏడాది రూ. 3000కోట్ల విద్యుత్తును మిగులుస్తామన్నారు. సానుకూల వాతావరణంలో ఈ ఏడాది రూ. 1,84,820 కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్నామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలకన్నా ఇది 10.1శాతం అధికమని చెప్పారు. 2009-14 మధ్య ఐదేళ్ల సగటు ప్రణాళికావ్యయం రూ. 48,100 కోట్లు మాత్రమేనని, సగటు వృద్ధి రేటు 8శాతం మాత్రమేనని తెలిపారు.




యూపీఏ ఐదేళ్ల సగటు పెట్టుబడులకు రెట్టింపు పెట్టుబడులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాధించగలిగామన్నారు. ఆర్థిక శాఖ నుంచి పరిమితులున్నా వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరో 20శాతం పెంచామని, ఈ మొత్తాన్ని వందశాతం సామర్థ్యం పెంపునకు, డబ్లింగ్ ప్రాజెక్టులకు వినియోగిస్తామని తెలిపారు. రాష్ట్రాలతో చేతులు కలిపి పీపీపీ మార్గంలో ప్రాజెక్టులు చేపట్టటం, విదేశాల్లో రూపాయి బాండ్లు విడుదల చేయటం వంటి వినూత్న పద్ధతుల్లో పెద్దమొత్తాల్ని సమీకరించగలమన్నారు. విద్యుదీకరణ బడ్జెట్‌ని 50శాతం పెంచామని, రైల్వేలను నౌకాశ్రయాలతో, ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానించటానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రోజుకు 7కిలోమీటర్ల బ్రాడ్‌గేజ్ నిర్మాణం లక్ష్యంగా రైల్వే పనిచేయనుందన్నారు. దాన్ని రాబోయే కాలంలో 13కు పెంచుతామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రైల్వేకు రూ. 30వేల కోట్ల సాయం అందించిన కేంద్రప్రభుత్వం వచ్చే బడ్జెట్‌కు రూ. 40వేలకోట్ల సాయం అందించనున్నట్టు తెలిపారు. ప్రయాణికుల మర్యాదకు, భద్రతకు పలు చర్యలను ప్రకటించారు. టికెట్లు తీసుకోవటాన్ని సులభతరం, పారదర్శకం చేసేందుకు సాంకేతిక సౌలభ్యాలను అందించారు. బయో టాయిలెట్లను పెంచుతున్నట్టు తెలిపారు. అన్ని స్టేషన్లలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్‌లో నిముషానికి 2000 టికెట్ బుకింగ్ సామర్థ్యం నుంచి 7200 టికెట్లకు పెంచామన్నారు. రూ. 92,714 కోట్లతో 44 ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఈ ఏడాది కొనసాగిస్తున్నట్టు చెప్పారు. 40వేల కోట్లతో రెండు లోకోమోటివ్ కర్మాగారాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. రైల్వేల ప్రస్తుత దుస్థితికి గత ప్రభుత్వాలే కారణమని, ఆ దుస్థితి నుంచి రైల్వేల్ని గట్టెక్కించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# సంస్కరణలు, విద్య-ఆరోగ్యంపై మరిన్ని పెట్టుబడులతోనే సానుకూలం సద్వినియోగం: ఆర్థిక సర్వే




ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వాతావరణం నిరాశాజనకంగా ఉన్నా భారత్‌లో మాత్రం సానుకూలంగా ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. అయితే ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకోవటానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం తగిన సంస్కరణల్ని తీసుకురాలేకపోతోందన్న భావాన్ని వ్యక్తం చేసింది. సంస్కరణల బండి వేగం పుంజుకోవాలని, విద్య, ఆరోగ్యం రంగాలలో పెట్టుబడులు ఎక్కువగా ఉండాలని, వ్యవసాయరంగంపై మరింత దృష్టి కేంద్రీకరించాలని, అనుచిత ఉచితాలను, సబ్సిడీలను తగ్గించి హేతుబద్ధీకరించాలని స్పష్టంచేసింది. ఇలాగైతేనే జీడీపీ వృద్ధిరేటు 8-10శాతం చేరే అవకాశముంటుందని పేర్కొంది. పన్ను-జీడీపీ నిష్పత్తిని పెంచటం, వస్తు, సేవల పన్నును వేగవంతంగా అమలు చేయటం కూడా వృద్ధికి అవసరమని సూచించింది.

కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టటానికి ముందు ఆర్థిక సర్వే-2016ను ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

2015-16లో జీడీపీ వృద్ధి రేటు 7.6శాతమని, 2016-17 ఆర్థిక సంవత్సరంలో 7-7.75 శాతం ఉంటుందని అంచనా వేసింది. 8-10శాతం వృద్ధి రేటు సాధించటానికి మరో రెండుమూడేళ్లు పడుతుందని పేర్కొంది. భారత్‌లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, స్థూల ఆర్థిక పరిస్థితుల్లో కనిపిస్తున్న సుస్థిరత, కీలక రంగాల్లో సంస్కరణలకు ప్రాధాన్యం ఇవ్వటాన్ని బట్టి చూస్తే వచ్చే సంవత్సరానికి వృద్ధి రేటు బాగానే ఉందని వ్యాఖ్యానించింది. వృద్ధి రేటు అంచనాలపై రిజర్వుబ్యాంకు గవర్నర్ వ్యక్తం చేస్తున్న అనుమానాలను ఆర్థిక సర్వేలో ఎక్కడా ప్రస్తావించలేదు. వృద్ధి రేటు 7శాతంపైన ఉంటుందని చెబుతున్నా వాస్తవానికి 5 శాతం దరిదాపుల్లోనే ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ డిమాండ్ మందగమనంపై మాత్రం సర్వే స్పష్టమైన హెచ్చరిక చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల పెంపు కారణంగా రూ.1.02లక్షల కోట్లు భరించాల్సి రావటం, బ్యాంకుల్లో పెట్టుబడి సాయానికి భారీ మొత్తాన్ని అందించాల్సిన నేపథ్యంలో ద్రవ్యలోటు లక్ష్యాలను సమీక్షించుకోవాలని సూచించింది.

సంపన్నులు, ప్రైవేటు రంగానికి లబ్ధి చేకూర్చే పన్ను మినహాయింపు విధానాన్ని దశలవారీగా ఎత్తివేయాలని, ఆర్థికంగా చెప్పుకోదగిన స్థితిలో ఉన్నవారిపై హేతుబద్ధమైన పన్ను విధించాలని సర్వే పేర్కొంది. వేగంగా పట్టణీకరణ జరుగుతున్న భారత్‌లో మెరుగైన పట్టణ జీవితానికి ఆస్తిపన్ను విధానం మెరుగ్గా ఉండాలని చెప్పింది.

సంఘటిత రంగ ఉద్యోగాలు మరిన్ని పెరగాలని సూచించింది. ఆయా సంస్థలు కాంట్రాక్టు ఉద్యోగులను నియమించుకునేలా చేస్తున్న ఈపీఎఫ్ వంటి నియంత్రణ అంశాలను పరిష్కరించాలని పేర్కొంది. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరచాలని స్పష్టంచేసింది.

పీపీఎఫ్ వంటి పొదుపు పథకాలు, పన్ను రాయితీలుండే పెట్టుబడులను ఉపసంహరించుకునేటప్పుడు కల్పిస్తున్న పన్ను ప్రయోజనాలను రద్దు చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. పొదుపు చేసేటప్పుడుగానీ, విత్‌డ్రా చేసుకునేటప్పుడుగానీ పన్ను విధించాలని, రెండింటిలోనూ విత్‌డ్రా సమయంలో పన్ను (ఈఈటీ) మెరుగైన పద్ధతని తెలిపింది. పీపీఎఫ్‌లో మదుపు పరిమితిని 2014-15లో పెంచినప్పుడు ఉన్నతాదాయవర్గాలే

ఎక్కువగా ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకున్నట్టు విశ్లేషించింది.

రాయితీపై ఇచ్చే వంటగ్యాస్ సిలిండర్ల సంఖ్యను ఏడాదికి పదికి తగ్గించాలని సర్వే సూచించింది.

సంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్ఈడీ బల్బులు తీసుకురావటానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం వల్ల 21,500 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ తగ్గి రూ.45,000 కోట్లకు పైగా ఆదా అవనుంది. ఏటా 109 బిలియన్ యూనిట్లు ఆదా అవుతాయి. వార్షికంగా 85 మిలియన్ టన్నుల కార్బన్‌డయాక్సయిడ్ ఉద్గారాలను నియంత్రించవచ్చు. ఇళ్లలో 77 కోట్ల సాంప్రదాయ బల్బులు, వీథుల్లో 3.5కోట్ల దీపాల స్థానంలో 2019 మార్చి నాటికి ఎల్ఈడీలను తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఏడాది జనవరి నాటికి ఇళ్లలో 4.77 కోట్లు, 5.51 లక్షల వీథిదీపాల కోసం ఎల్ఈడీలను ప్రభుత్వం పంపిణీ చేసింది. వ్యవసాయ సంస్కరణల్లో భాగంగా ఎరువుల మార్కెట్‌పై నియంత్రణల్ని ఎత్తివేసి రాయితీ సంచులపై పరిమితి విధించాలని కూడా సర్వే సూచించింది.

**ఆర్థిక సర్వే ముఖ్యాంశాలు :**

- 2016లో పారిశ్రామికాభివృద్ధి 7.3శాతం, తయారీరంగ అభివృద్ధి 9.5శాతం, సేవారంగం వృద్ధి 9.2శాతంగా నమోదు కావొచ్చు
- ప్రత్యక్ష నగదు బదిలీ వల్ల గ్యాస్ సిలిండర్ రాయితీ వ్యయంలో 24శాతం ఆదా
- చమురు ధరల క్షీణతతో సబ్సిడీ వ్యయాలు జీడీపీలో 2శాతం లోపే ఉండొచ్చు
- ద్రవ్య స్థిరీకరణకు రాయితీలను హేతుబద్ధీకరించాలి
- ద్రవ్యోల్బణంపై వేతనసంఘం సిఫారుసుల ప్రభావం తక్కువే
- ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినా ధరలు మరింత స్థిరీకరణ కావాలి
- చమురు ధరల తగ్గుముఖంతో మధ్యకాలంలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గవచ్చు
- ఏప్రిల్-సెప్టెంబర్‌లో 1.4శాతంగా కరెంటు ఖాతా లోటు. 2016-17లో సీఏడీ 1-1.5శాతంగా ఉండొచ్చు
- రూపాయి మారకం విలువ ప్రస్తుతం ఎంతయితే ఉండాలో అంతే ఉంది. బలపడేందుకు ప్రత్యేకంగా చర్యలు అనవసరం.
- చైనా తరహాలోనే కరెన్సీ విలువలో సర్దుబాట్లు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి
- భారత్‌లోకి పెట్టుబడుల రాక తగ్గుముఖం పట్టటం వల్ల ఒకవేళ రూపాయి మారకం విలువ తగ్గుముఖం పట్టినా వేచిచూడాలి
- బ్యాంకుల సమస్య పరిష్కారానికి మళ్లీ మూలధన సాయాన్ని అందించటంతో సంస్కరణల్ని చేపట్టాలి
- 2018-19 నాటికల్లా ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.1.8లక్షల కోట్ల మూలధనం అవసరం
- ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సాయం అందించేందుకు నిరర్థక ఆస్తుల అమ్మకం ప్రతిపాదన
- కార్పొరేట్ సంస్థలకిచ్చిన మొండి బకాయిలను విక్రయించాలి లేదా పునర్వ్యవస్థీకరించాలి
- ప్రస్తుత ఎగుమతుల మందగమనం మరికొంతకాలం కొనసాగవచ్చు
- ఏప్రిల్-జనవరిలో వాణిజ్య లోటు 11960 కోట్ల డాలర్ల నుంచి 10680 కోట్ల డాలర్లకు పరిమితం కావొచ్చు
- పన్నుల ఆదాయం పెరగొచ్చు
- ఆస్తిపన్ను విధానాన్ని తక్షణం సమీక్షించాల్సిన అవసరముంది
- స్థిరాస్థి ధరల్లో హెచ్చుతగ్గులను అధికపన్ను రేట్లు నియంత్రిస్తాయి
- స్థిరాస్థి, వ్యవసాయ ఆదాయంపై సహేతుక పన్ను విధానాన్ని తీసుకురావాలి
- ఆస్తిపన్ను రేట్లు అధికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పెరుగుతాయి
- అధిక విద్యుత్తు టారిఫ్‌లు మేకిన్ ఇండియాకి అవరోధంగా ఉన్నాయి
- పన్ను మినహాయింపులను దశలవారీగా తొలగించటం వల్ల ప్రయివేటు రంగానికి మేలు జరుగుతుంది
- మౌలికరంగానికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచాల్సిన అవసరముంది.

# ప్రయివేటు చికిత్స ఖర్చు 4 రెట్లు ఎక్కువ



మనదేశంలో వైద్యఖర్చుల కోసం ప్రజలు తమ జేబుల్లో నుంచి ఏటా రూ.3,00,000 కోట్లు దాకా ఖర్చు చేస్తున్నట్టు అంచనా. పేదరికంలో కూరుకుపోతూ జనం చేస్తున్న ఈ ఖర్చులో ఎక్కువశాతం ప్రయివేటు, కార్పొరేటు రంగాలకే పోతోందని ఆర్థికసర్వే వెల్లడించింది. ప్రభుత్వాసు పత్రుల్లోకంటే ప్రయివేటు ఆసుపత్రుల్లో నాలుగు రెట్లు ఎక్కువ ఖర్చవుతోందని తెలిపింది. దేశాభివృద్ధికి కీలకమైన ఆరోగ్యరంగాన్ని ఉన్న పరిమిత వనరుల్లోనే సమూలంగా ప్రక్షాళన చేయటం, అందరికీ ఆరోగ్యం అందుబాటులోకి తేవటం ప్రభుత్వం ముందున్న సవాలని స్పష్టంచేసింది. “2014 జనవరి నుంచి జూన్ వరకు సేకరించిన వివరాల ప్రకారం, ఏ జబ్బుకైనా ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటే ప్రభుత్వాసుపత్రుల్లో కంటే నాలుగు రెట్లు ఎక్కువ జేబులో నుంచి చెల్లించుకోవాల్సి వస్తోంది. కాన్పులు మాత్రం కొంత మినహాయింపు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఒక కేసుకి వైద్యసేవలందించటానికి సగటున రూ.28,850 ఖర్చయితే, ప్రభుత్వ నిర్వహణలోని సంస్థల్లో రూ.6,120 ఖర్చయింది. వైద్యఖర్చుల్లో, సేవల్లో గ్రామీణ-పట్టణ అంతరాలు ఎక్కువగా ఉన్నాయి. ఒక వ్యక్తి ఆసుపత్రి పాలైతే గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.16,956, పట్టణాల్లోనైతే రూ.26,455 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రుల్లో చేరాల్సిన అవసరంలేని వైద్యానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రూ.509, 639 ఖర్చు చేస్తున్నారు” అని జాతీయ నమూనా సర్వేను ఉటంకిస్తూ సర్వే పేర్కొంది. ఈ వైద్యఖర్చుల భారం ప్రజల్ని పిండేస్తోంది, అనేకమందిని పేదరికంలోకి నెట్టేస్తోంది, వనరుల్ని సమన్వయం చేసుకుంటూ ఇంత జనాభాకు నాణ్యమైన వైద్యసేవల్ని అందించటం ఎలా అనే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచించాలి అని సర్వే సూచించింది. ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటున్న ఇన్సూరెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో 13.1, పట్టణాల్లో 12శాతానికి అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రయివేటు ఇన్సూరెన్స్‌ను పరిష్కారంగా ఆశ్రయిస్తున్నారని చెప్పింది. కాన్పులకు ప్రయివేటు ఆసుపత్రుల్లో అయ్యే ఖర్చులో పదోవంతు మాత్రమే ప్రభుత్వ రంగంలో అవుతోందని తెలిపింది. సమాజంలో పరిమిత ఆదాయం ఉన్నవారికి, పేదలకు సకాలంలో మంచి వైద్యసేవలు అందించటం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని స్పష్టంచేసింది. ఈ క్రమంలో నిపుణులైన వైద్యసిబ్బందిని పెంచుకోవటం, అన్ని ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవల్ని అందుబాటులో ఉంచటం కీలకమని తెలిపింది.

## తెలుగు రాష్ట్రాల్లో వైద్యానికి అనారోగ్యం, 50శాతం సిజేరియన్ కాన్పులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వైద్యరంగం అనారోగ్యకరంగా ఉందని సర్వే వ్యాఖ్యానించింది. అత్యవసర పరిస్థితిలో చేయాల్సిన సిజేరియన్ కాన్పుల్ని సాధారణ పరిస్థితుల్లో కూడా చేస్తూ తల్లీబిడ్డల ఆరోగ్యంతో ఆసుపత్రులు చెలగాటమాడుతున్నాయని హెచ్చరించింది. దీనివల్ల ప్రజలపై మితిమీరిన భారం సైతం పడుతోందని పేర్కొంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, త్రిపురలో కూడా ఈ ప్రమాదకర ధోరణులు పెరుగుతున్నాయని తెలిపింది. సాధారణంగా సిజేరియన్ల శాతాన్ని అత్యవసర సేవల అందుబాటుకు ప్రమాణంగా భావిస్తారు. మొత్తం ప్రసవాల్లో సిజేరియన్ కాన్పులు ఐదుశాతం కంటే తక్కువగా ఉంటే అత్యవసర సేవల కొరత ఉన్నట్టు గుర్తిస్తారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ దీన్నే ప్రమాణంగా తీసుకుంటుంది. 15శాతం కంటే ఎక్కువగా చేసే సిజేరియన్లు అనవసరమైనవిగానే ఆరోగ్య సంస్థ భావిస్తుంది. దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో 50శాతానికి పైగా ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరగటం మంచి పరిణామమే అయినా, కత్తెర కాన్పులు ఎక్కువవటం సమర్థనీయం కాదని సర్వే పేర్కొంది. కత్తెర కాన్పులు తల్లీబిడ్డల ఆరోగ్యంలో పలుసమస్యలకు దారితీస్తాయని, దీనిపై ప్రజారోగ్యశాఖలు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది.

**కొసమెరుపు:** అందరికీ ఆరోగ్యం అందించే విధానం రూపొందించటం ఎంత అవసరమో గణాంకసహితంగా ఆర్థిక సర్వే హెచ్చరించి చెప్పినా, కేంద్ర బడ్జెట్ 2016లో కూడా గత ఏడాదిస్థాయిలోనే ఆరోగ్యరంగానికి కేటాయింపులు జరిపారు. ఇన్సూరెన్స్ విధానం పరిష్కారంకాదని, గుదిబండ అవుతుందని అమెరికా వంటి దేశాల అనుభవాలు స్పష్టంగా నేర్పుతున్నా, ప్రజారోగ్య సమస్యల పరిష్కారానికి బీమా మార్గాన్నే కేంద్రప్రభుత్వం అనుసరించింది.

# భజన్‌లాల్ 2.0లు

## ముఖ్యమంత్రుల చుట్టూ కేంద్రీకృత పాలనతో ఫిరాయింపుల భ్రష్ట రాజకీయం




అధికారాలన్నీ జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి, రాష్ట్రాల స్థాయిలో ముఖ్యమంత్రి చేతుల్లో కేంద్రీకృతమవటం వల్ల ఓటు వేశాక కోట్లాది ప్రజలు ఐదేళ్లపాటు ప్రతివనికీ యాచించాల్సి వస్తోంది. తాత్కాలిక అవసరాల కోసం అవినీతి నేతలను కూడా గతిలేక ఎన్నుకోవాల్సి వస్తోంది. దీంతో ఎలాగోలా అధికారంలోకి రాగలిగితే అంతా గుప్పెట్లో పెట్టుకుని ఏమైనా చేయొచ్చనే, ఎంతైనా దోచుకోవచ్చనే ధోరణి పెరుగుతోంది. అధికారం ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే మార్గంగా కాకుండా పెత్తనం చెలాయించటానికి, దోచుకోవటానికి లక్ష్యంగా మారింది. రాష్ట్రంలో ఒక వ్యక్తి చేతిలో కేంద్రీకృతం కావటంతో ఆ వ్యక్తిని ప్రశ్నించే, ధిక్కరించే శక్తి కూడా చాలామంది శాసనసభ్యులకు ఉండటం లేదు. అభివృద్ధి కోసమంటూ ప్రతిపక్ష సభ్యులు అధికార పార్టీలోకి జంప్ చేస్తున్నారు. అధికార పార్టీలో లేకపోతే ఒక శాసనసభ్యుడు అసెంబ్లీలో మాట్లాడలేడా? నియోజకవర్గంలో ప్రజల సమస్యల్ని పరిష్కరించలేడా? కూకట్‌పల్లిలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శాసనసభ్యునిగా ఉన్నప్పుడు రూ. 1600కోట్ల అభివృద్ధి పనులు చేశారు. పలు సమస్యల్ని పరిష్కరించారు. శాసనసభలో అనేక సమస్యల్ని ప్రస్తావించి, పరిష్కారాలను చూపుతూ చట్టాలను ప్రతిపాదించి చిరస్థాయిగా నిలిచిపోయే ప్రసంగాలు చేశారు. అది కూడా సమైక్య, ప్రత్యేక ఉద్యమాలతో రాష్ట్రం అట్టుడికిపోతూ పరిపాలన స్తంభించిపోయి, లోక్‌సత్తాకు ఆయనొక్కడే అప్పుడు చట్టసభలో ప్రతినిధి అయినా కూడా.

ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, రాజకీయాన్ని ప్రజాసేవకు ఒక మార్గంగా గుర్తిస్తే తాను ఎన్నికైన పార్టీ నుంచి ఫిరాయించటం వంటి వాటికి ఏ ప్రతినిధీ పాల్పడరు. పార్టీ మారాలనుకుంటే, చట్టసభ సభ్యత్వానికి రాజీనామా చేశాకే. కానీ ఈవేళ అధికారమే సర్వస్వం కావటంతో పార్టీలను సాంప్రదాయ నేతలు పట్టించుకోవటం లేదు. పైగా ఆ పార్టీలన్నిటికీ విధానాలు ఒకటే. ఆ పార్టీల నేతలు కూడా చాలామంది తెర వెనక అవినీతి వ్యాపారాలు కలిసే చేస్తుంటారు. దాంతో కండువాలు, ముఖాలు మారినా నేతలకు తేడా సైతం ఏమీ అనిపించటం లేదు. ఎన్నికల్లో ప్రచారానికి కోట్లు గుమ్మరించకుండా, డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలు లేకుండా ప్రజలు ఓట్లు వేయటం లేదు, వారికి నైతిక సంజాయిషీ చెపాల్సిన పనిలేదు అని నేతలు అంతర్గతంగా ఎదురు దబాయిస్తున్నారు.

రాష్ట్రానికి సర్వాధికారిలా మారిన ముఖ్యమంత్రిని ఎదుర్కోలేకపోవటం ఒకటి, ఎన్నికలలో పెట్టిన ఖర్చుకు అనేకరెట్లు దండుకోవటానికి ఇతరత్రా అవకాశాల కోసం అధికార పార్టీ అండ కావాల్సిరావటం రెండోది. ఈ కారణాలతో రాత్రికి రాత్రి పార్టీల్ని ఫిరాయిస్తున్నారు.

1980లలో హర్యానాలో భజన్‌లాల్ అనే భక్త సాంప్రదాయ రాజకీయుడు ఒక బహిరంగ సవాలు ఎన్నికల సమయంలోనే విసిరాడు. 'నేను ఒక్కడ్ని గెలిచినా నేనే ముఖ్యమంత్రిని అవుతాను' అని. ఎంతమంది ఎమ్మెల్యేలనైనా, ఎన్ని పార్టీల నుంచైనా కొనుగోలు చేసేయగలను అని ఆయన ప్రజాస్వామ్యాన్ని సవాలు చేశాడు. ఇందిరాగాంధీ 1975లో ఎమర్జెన్సీతో అధికారాలన్నిటినీ తన గుప్పెట్లో పెట్టుకునే కేంద్రీకృత పాలనను వ్యవస్థీకృతంగా ప్రారంభించటంతో కేంద్రంలో పీఎం, రాష్ట్రంలో సీఎం, జిల్లాలో కలెక్టర్ విధానం వేళ్లూనుకుపోయింది. ఆ తర్వాత భజన్‌లాల్ బ్రాండ్ ఆయారాం గయారాంలు ఊపందుకున్నాయి. నాడు భజన్‌లాల్ చేసిన పనినే ఇప్పుడు తెలుగునాట ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కె.చంద్రశేఖర రావు చేస్తున్నారు. కాకపోతే వీరిది భజన్‌లాల్ 2.0 వెర్షన్. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన ప్రయత్నానికి కొంత కొనసాగింపు. ఎమర్జెన్సీ నాటి కేంద్రీకృత పాలనకు అభివృద్ధి, సంక్షేమం, సాంకేతికత, ప్రపంచీకరణ, ప్రాంతీయ మసాలా వంటివి జోడిస్తున్నారు.

చంద్రబాబు నాయుడు 2014లో ఎన్నికల్లో గెలిచిన వెంటనే పార్టీల ఫిరాయింపుల కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏకైక ప్రతిపక్షం వైకాపా నుంచి ఎంపీల్ని ఆహ్వానించారు. అయితే అంతా అనధికారికంగా. ఆ క్రమంలోనే హైదరాబాద్‌లో ఒక తెలంగాణ ఎమ్మెల్సీని కొంటూ అడ్డంగా దొరికారు. అదే ఓటుకు కోట్లు కేసుగా దేశచరిత్రలో పేరుమోసింది. ప్రజలకు అర్థంకాలేదుగానీ, అసలు ఎన్నికలకు ముందే ఈ ఫిరాయింపులకు చంద్రబాబు బీజం వేశారు. తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక పార్టీలో భారీ అవినీతికి, అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన నేతల్నే తెలుగుదేశంలో చేర్చుకని

టికెట్లిచ్చారు. ప్రజాజీవితాన్ని ఛిన్నాభిన్నం చేసే వాగ్దానాలు, రకరకాల సమీకరణాలకు తోడు వసూలు చేసిన వేలకోట్ల డబ్బును ఖర్చు చేసి గెలిచారు. పార్టీలకన్నా గెలుపే ముఖ్యం అని ఎన్నికలకు ముందే మొదలైన ఈ ధోరణి గెలిచాక ఫిరాయింపుల రూపంలోకి మారింది. పార్టీలు వేరు అని భావించి ప్రజలు ఓట్లు వేశారుగానీ, ఆ పార్టీల నాయకులకు అవేమీ లేవని తెలుగునాట 2014 ఎన్నికలు స్పష్టంగా రుజువుచేశాయి. విధానాలను బట్టి కాకుండా అధికారం, అవకాశం కోసమే వాళ్లు పార్టీల్లో చేరుతున్నారు. ఇదేసమయంలో తెలంగాణలో కేసీఆర్ బాహాటంగానే ఫిరాయింపులకు తెరతీశారు. వైకాపా నేత వైఎస్ జగన్ గెలిచినప్పుడు ఆయన అవినీతి ప్రజలు ఆమోదించినట్టు కాదని వాదించినవారు కూడా హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తెరాస గెలిచాక ఫిరాయింపులకు ప్రజలు ఆమోదం తెలిపారని సూత్రీకరించారు. ఆహా, ఏమి నాయకత్వ చాతుర్యం అని కేసీఆర్ చర్యలను ప్రశంసించారు.

కానీ ఈ 19వ శతాబ్దపు పాత రాజకీయంలో డబ్బుతో గెలిచిన నేతలు, ఎలాగోలా ఓటు వేయటం తప్ప ఏ అధికారం లేని ప్రజలూ ఇద్దరూ ముఖ్యమంత్రి చుట్టూ తిరిగే కేంద్రీకృత పాలనకు బాధితుల్లా మారి రాజకీయానికి తీవ్ర నష్టం తీసుకొస్తున్నారు.

21వ శతాబ్దపు ఆర్థిక జీవనాన్ని అందిస్తామనే హామీతో చంద్రబాబు, కేసీఆర్ 19వ శతాబ్దపు లక్షణాలున్న భజన్‌లాల్ మార్కు రాజకీయం చేస్తున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులూ అరచేతిలో చూపుతున్న అభివృద్ధి, ఆకర్షణీయ జీవితం అందాలంటే భజన్‌లాల్ లాంటి రాజకీయం చేసినా చూసీచూడకుండా వదిలేయొచ్చేమో అనే మీమాంసను ప్రజల్లో కలిగిస్తున్నారు. ఆనాడు భజన్‌లాల్‌ని ఎగతాళి చేసి దునుమాడిన తెలుగుగడ్డ మీద పచ్చిగా ఫిరాయింపులు, అందుకోసం కోట్ల రూపాయలు చేతులు మారుతున్నా మామూలే అనే వాతావరణం పెరుగుతోంది. పార్టీలు, నేతలు, వారి కుటుంబసభ్యుల ప్రయోజనాలే దేశప్రయోజనాలన్నట్టు వార్తల్ని సృష్టిస్తూ ప్రచారం జరుగుతోంది. కానీ ఎల్లకాలం ఆ హవా సాగదు. ఎందుకంటే ఆధునిక ఆర్థిక జీవితానికి, పాత రాజకీయానికి ఎప్పుడూ చుక్కెదురే. అవి ఎప్పుడూ కలిసి పనిచేయలేవు. మనకున్న అభివృద్ధి అవకాశాలను, వ్యక్తిగత ఆదాయాన్ని భజన్‌లాల్ మార్కు రాజకీయం ఖచ్చితంగా దెబ్బతీస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో బైటపడుతున్న కుంభకోణాలు చూస్తుంటే కాస్త రాజకీయ జ్ఞానమున్నవారికి సైతం దిగ్భ్రాంతి కలుగుతోంది. అది ప్రభుత్వమా? దొంగలముఠానా? అనే సందేహాలు కలుగుతున్నాయి. తెలంగాణలో కూడా ఆ పోకడలున్నా, ఇంకా బైటికి రావటం లేదు. భావప్రకటనా సామర్థ్యమున్నవారందరికీ ఏదోక వ్యక్తిగత ప్రయోజనం అందిస్తూ వార్తలు రాకుండా చేస్తున్నారు. దీంతో వాళ్లు కాస్త వంగాల్సిన చోట కూడా ఏకంగా




పాకేస్తున్నారు. ప్రజల్లో చాలామందికి భావప్రకటనా స్వేచ్ఛ ఉన్నా, ఓటులాగానే దాన్ని సద్వినియోగం చేసుకునే స్థాయి లేదు కాబట్టి వారి గురించి కేసీఆర్ ప్రభుత్వం భయపడటం లేదు. ఓ చక్రవర్తిలా, నిజాం నవాబులా తానిచ్చే హామీల అమలుకు ఏటా రూ.5,000కోట్లతో ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్)ని ఏర్పాటు చేసుకునే స్థాయికి ఆయన కేంద్రీకృత పాలన చేరింది. సామంతుల్లాంటి మంత్రులకు రూ.25 కోట్లు ఇస్తారట. అంటే ఇక స్థానిక స్వయంపాలన, తెలంగాణ ప్రజల సాధికారత క్రమంగా క్షీణించిపోవటమే.

అభివృద్ధికి, వ్యక్తిగత ఆదాయాల పెరుగుదలకు కేంద్రీకృత పాలన తప్పనిసరి అనే ముసుగులో చంద్రబాబు, కేసీఆర్ చేస్తున్న ఫిరాయింపుల రాజకీయం ఆనాడు భజన్‌లాల్ చేసిన రాజకీయం కంటే కూడా దీర్ఘకాలంలో ప్రమాదకరమైనది. నిజాయతీపరులు, సమర్థులు మరింత రాజకీయాల నుంచి దూరమయ్యేలా వీరు వ్యవహరిస్తున్నారు. అవసరమైనప్పుడు తమ తప్పుడు రాజకీయానికి జాతీయ పార్టీల చేత కూడా తందానా అనిపించుకుంటున్నారు. ఉన్నకొద్దీ సంస్థానాధీశుల్లాంటి ఛోటా, ప్రాంతీయ నేతలు పెరగటం, వారి అవినీతి, వంశపారంపర్య రాజకీయాలను సమర్థిస్తూ జాతీయ పార్టీలు జాతి హితాన్ని వీడి వ్యాపార ఒప్పందంలా దేశాన్ని పాలించటం భారత్‌కి ఏమాత్రం క్షేమదాయకం కాదు.

ఫిరాయింపుల సంస్కృతిని, అందుకు మూలమైన కేంద్రీకృత పాలనని సమూలంగా మార్చి ప్రజాజీవితంలో కనీస విలువల్ని ప్రతిష్ఠించాలి, అధికారాన్ని, పాలనను వికేంద్రీకరించి జనం భాగస్వామ్యాన్ని పెంచాలి. అందుకోసం సంస్కరణ కావాలిప్పుడు.

భజన్‌లాల్ ఉదంతం తర్వాత 1985లో వచ్చిన 52వ రాజ్యాంగ సవరణ లోపాలను అధిగమించి బలోపేతం చేసే ప్రయత్నంలో లోక్‌సత్తా 91వ రాజ్యాంగ సవరణను (2003) సాధించింది. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా మూడోవంతు మంది సభ్యులు అంగీకరిస్తే తప్ప పార్టీ మారటం చెల్లదు. కానీ 91వ సవరణలో పార్టీ మారటం చెల్లాలంటే మూడింట రెండు వంతుల మంది ఒప్పుకోవాలి. దీంతో ఎంతోకొంత పరిస్థితి మెరుగవుతుందనుకున్నా, స్పీకర్ల నిర్వాకం వల్ల ఈ సవరణ కూడా

పెద్దగా ఫలితాలనివ్వలేదు. స్పీకర్ల పక్షపాత రాజకీయాలపై అనేక ఉదాహరణలు కనిపిస్తుండటంతో, ఫిరాయింపులపై నిర్ణయాన్ని స్పీకర్‌కు కాకుండా ఎన్నికల సంఘానికి ఇవ్వాలని అప్పుడు కూడా లోక్‌సత్తా ప్రతిపాదించినా 91వ సవరణలో అందుకు చోటు కల్పించలేదు.

మరోవైపు, 91వ రాజ్యాంగ సవరణ వచ్చాకైనా విప్‌ల జారీ పేరుతో చట్టసభ సభ్యుల స్వతంత్ర అభిప్రాయాలకు అడ్డుకట్టవేయటం తగ్గుతుందనుకుంటే అది మరింత పెరిగింది. విప్‌ను ధిక్కరించి ఓటింగ్‌కు హాజరు కాకపోయినా 52వ రాజ్యాంగ సవరణ ప్రకారం సభ్యత్వం రద్దవుతుంది. కానీ 91వ సవరణలో విప్‌ను ధిక్కరించటం వల్ల సభలో ప్రాతినిధ్యం పోవాలనే నిబంధన లేదు. ఈ వెసులుబాటు ఉన్నా కేంద్రీకృత పాలన, సొంత ఎస్టేటుల్లా పార్టీల నిర్మాణం వల్ల ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతల చేతుల్లో ఆయా పార్టీల సభ్యులు బందీలుగా మారారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో, పార్లమెంటులో సొంత ఆలోచనతో స్పందించే అవకాశమే లేకుండా పోయింది. పార్టీ అధ్యక్షుడు/అధ్యక్షురాలు మాట్లాడనివ్వకపోతే నోర్మూసుకు కూర్చోవాల్సిందే. ఉదాహరణకి, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో చంద్రబాబు నాయుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ తప్ప ఇంకెవరూ పెద్దగా మాట్లాడేదేమీ ఉండదు. వారిద్దరే సభ అనే పరిస్థితి కొనసాగుతోంది. కాస్త అటూఇటుగా పార్లమెంటులో కూడా ఇదే జాడ్యం కొనసాగుతోంది. ప్రభుత్వంలాగే పార్టీల్లో కేంద్రీకృత నిర్మాణం వల్ల తలెత్తిన దుష్పరిణామమిది.




కొంపముంచారు గదయ్యా.. నేనన్నది ఏపీలో మన పార్టీలో చేరేనాయకుల గురించి..

అందుకే 91వ రాజ్యాంగ సవరణ తేవటానికి స్వయంగా కృషి చేసినా కూడా అందులోని లోపాల్ని జేపీ తరచూ విమర్శిస్తుంటారు. పార్టీలు ఫిరాయించిన ప్రజాప్రతినిధులపై వేటు వేసే అధికారాన్ని స్పీకర్‌కి కాకుండా ఎన్నికల సంఘానికే ఇవ్వాలని, విప్ జారీని కొన్ని అంశాలకే పరిమితం చేయాలని జేపీ పునరుద్ఘాటిస్తున్నారు. చట్టపరమైన ఈ ఏర్పాటుతో పాటు అసలు పార్టీలు ఫిరాయించాల్సిన అవసరం ప్రజాప్రతినిధులకు, అలా ఫిరాయించేవారిని ఎన్నుకునే దుస్థితి ప్రజలకు లేకుండా అధికారాన్ని ముఖ్యమంత్రి చేతుల్లో నుంచి జిల్లా యూనిట్‌గా మునిసిపల్ వార్డులకు, గ్రామపంచాయతీలకు వికేంద్రీకరించాలి. ప్రజలు తమ రోజువారీ అవసరాలకు ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి హక్కుగా సేవలందించేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని పకడ్బందీగా రూపొందించి అమలు చేయాలి. ప్రతి పనికీ గడువు పెట్టి, ఆలోగా చేయలేకపోతే రోజుకు కనీసం రూ. 250 పరిహారం దరఖాస్తు చేసిన పౌరునికి చెల్లించాలి. అప్పుడు ఫిరాయింపులకు ప్రోత్సాహం అందకుండా పోతుంది.

ఇక ముఖ్యమంత్రులు కూడా పెద్దగా మెజారిటీ లేని పరిస్థితుల్లో ఉన్న ఎమ్మెల్యేలను మెయింటెయిన్ చేయటానికి, కొత్త ఎమ్మెల్యేలను ఆకర్షించటానికి ప్రయత్నిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు ఫిరాయింపులు రాజకీయంలో భాగమనే పరిస్థితిని కల్పించేందుకు ప్రయత్నిస్తుండటం వల్ల ముందుందు చాలా రొటీన్‌గా ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలు మారిపోతారనటంలో ఏమాత్రం సందేహం లేదు. ఇటీవల జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓటింగ్ సరళి మీద కూడా ఈ దుష్ప్రభావం కొంత పడింది. ఎవరికి ఓటు వేసినా టీఆర్ఎస్‌లో చేరిపోతారనే భయంతో చాలామంది మధ్యతరగతివారు బూత్‌లకు రాలేదు, వచ్చినవాళ్లు కారుకే ఓటు వేశారు. ముఖ్యమంత్రిని ఎమ్మెల్యేలు కాకుండా నేరుగా ప్రత్యక్ష ఓటింగ్ ద్వారా ప్రజలే ఎన్నుకునే ఏర్పాటు చేస్తే ఈ అవకాశవాద రాజకీయానికి కొంతమేర కళ్లెం పడుతుంది. ఒకవ్యక్తి మొత్తం రాష్ట్రమంతా డబ్బు పంచి గెలవటం దాదాపు అసాధ్యం కాబట్టి, డబ్బు రాజకీయాలు కూడా తగ్గుతాయి. ముఖ్యమంత్రి మిగతా ఎమ్మెల్యేలకంటే గొప్పగా ఉండేందుకు తన సొంత నియోజకవర్గానికి వందల, వేల కోట్ల నిధుల్ని పారించుకునే ధోరణులకూ కళ్లెం పడుతుంది.

ఫిరాయింపుల చట్టాన్ని సమగ్రంగా సవరించటంతోపాటు ముఖ్యమంత్రి పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించటం, అధికారాన్ని వికేంద్రీకరించి రాష్ట్రాలకు సొంత రాజ్యాంగాలను, పాలనావిధానాలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛను కల్పించి కేంద్రం కేవలం జాతీయస్థాయి, విదేశాంగ అంశాలకే పరిమితమవటం, ఈ రెంటితోపాటు మూడో అంచెలో స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించి ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం ద్వారా డబ్బు–ఫిరాయింపుల చుట్టూ తిరిగే దుర్రాజకీయాన్ని నిరోధించవచ్చు. అయితే అన్నిటికంటే ముఖ్యం ప్రజలు స్థానికంగా ఎక్కడికక్కడ బాధ్యత తీసుకుని నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించటం. ఈ సంస్కరణలన్నిటి లక్ష్యమూ ప్రజలకు పౌరసత్వం, నాయకత్వం అంటే ఏమిటో తెలిసొచ్చి ఓటింగ్ దగ్గర్నుంచి తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించటం ద్వారా రాజకీయ వ్యవస్థను సరైన రీతిలో నడిపించటమే.

# 'ఫిరాయింపుల చట్టం'తో ప్రజాస్వామ్య ఖననం!

- డా॥ జయప్రకాష్ నారాయణ్

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో మార్పులు ప్రతిపాదిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించింది. లోపభూయిష్టమయిన ఈ చట్టాన్ని 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం తెచ్చింది. అప్పుడు లోక్‌సభలో 80శాతం స్థానాలు, రాజ్యసభలో మూడింట రెండు వంతుల స్థానాలు కాంగ్రెస్ పార్టీవే. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం ప్రమాదం ఏర్పడకూడదని, అదే సమయంలో అవసరమయితే వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలను పడగొట్టటానికి చట్టబద్ధమయిన అవకాశం ఉండాలని ఆలోచించి ఆనాడు రాజ్యాంగంలో 52వ సవరణను చేసి, పదవ షెడ్యూల్‌లో చేర్చారు. అదే పార్టీ ఫిరాయింపుల నిరోధ చట్టంగా ప్రచారమయింది. నిజానికి దాన్ని 'పార్టీ ఫిరాయింపుల ప్రోత్సాహక చట్టం' అని పిలవటం సబబు!

### ఒకరు చేస్తే శిక్ష- కలిసి చేస్తే సత్కారం!

పార్టీల మీద, ప్రభుత్వాల మనుగడ మీద, చట్టసభలలో ఓటింగు పైన, బహిరంగ చర్చలపైన 52వ రాజ్యాంగ సవరణ విశేష ప్రభావాన్ని చూపింది. ప్రజల తీర్పుని మన్నించాలని, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని ఎన్నికయిన చట్టసభ సభ్యులు వమ్ము చేయరాదని, పార్టీల నుంచి ఫిరాయింపులను నిరోధించాలనేవి ఈ చట్టం ప్రకటించిన లక్ష్యాలు. వాస్తవానికి ఈ చట్టం ఫిరాయింపులను ఆపలేకపోయింది. 1985లో ఈ చట్టం వచ్చిన నాటి నుంచి నేటి వరకు వందల సందర్భాల్లో పార్టీ ఫిరాయింపులు జరిగాయి. 1985 రాజ్యాంగ సవరణలో ప్రత్యేకత ఏమంటే ఒంటరిగా పార్టీలు మారితే సభ్యత్వం రద్దవుతుంది. అదే మూడోవంతు సభ్యులను ఏదో ఒక విధంగా కూడగట్టుకుని పార్టీ ఫిరాయిస్తే అది చట్టబద్ధమవుతుంది. ఒకరకంగా ఇది 'ఒకడు మరో మనిషిని చంపితే ఆ హత్యకు శిక్ష పడుతుంది, అదే నలుగురు కలిసి హత్య చేస్తే అందుకు బహుమానం ఇస్తాం' అని చెప్పటమే! ఇలాంటి అసంబద్ధ చట్టం వల్ల పార్టీలలో "చీలిక" సృష్టించటం, ప్రోత్సహించటం, రాజ్యాంగబద్ధ కుట్రలను, తిరుగుబాట్లను అత్యంత రహస్యంగా, పకడ్బందీగా చేపట్టటం, ప్రభుత్వాలను మూడో కంటికి తెలియకుండా రాత్రికి రాత్రి దింపటం, ప్రజల తీర్పుతో



సంబంధం లేకుండా చట్టసభ సభ్యులను కొనటం, అలా అమ్ముడుపోయినవాళ్లు, కొన్నవాళ్లు గద్దెనెక్కి ప్రజాధనాన్ని దోచుకోవటం- ఇవన్నీ మన రాజకీయంలో అంతర్భాగమయ్యాయి. అసలు ఎన్నికలే లోపభూయిష్టంగా ఉండి అక్రమార్జనపరుల్ని, గూండాలను గద్దెల మీదకెక్కిస్తుంటే, ప్రజల తీర్పునకు విలువ కూడా లేకుండా పార్టీ ఫిరాయింపులు రాజకీయాన్ని బేరసారాలతో కూడిన ఒక నీతిబాహ్యమైన, సిగ్గులేని క్రీడగా మార్చేశాయి. ప్రస్తుతం రాజకీయమంటే ఏదో ఒకరకంగా చట్టసభలో సంఖ్యాబలాన్ని కూడగట్టుకోవటం, దాన్ని కాపాడుకోవటం తప్ప మరొకటి కాదు. 1984 ఆగస్టులో ఎన్.టి.ఆర్ ప్రభుత్వాన్ని ఆకస్మికంగా గద్దె దింపటం, దానిపైన ప్రజల తీవ్ర నిరసన వ్యక్తం అయిన కారణాన వేరే గతిలేక మళ్లీ ఆ ప్రభుత్వానికే పట్టం కట్టటం మనందరికీ తెలుసు. అదే సంవత్సరం కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ఫిరాయింపుల ద్వారా తొలగించటం నేటి కాశ్మీర్ సంక్షోభానికి ప్రధాన కారణమయింది. అంతకుమునుపే, 1979లో కేంద్రంలో జనతా ప్రభుత్వాన్ని పార్టీ ఫిరాయింపుల ద్వారా గద్దె దింపటం, చివరికి మధ్యంతర ఎన్నికలు రావటం విదితమే. 1985లో 52వ సవరణ చేపట్టినప్పుడు, ఇలాంటి ఫిరాయింపులు జరగవని చాలామంది ఆశించారు. వాస్తవానికి ఫిరాయింపులు ఏమాత్రం ఆగలేదు.

1991-92 కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన మనుగడ కోసం వివిధ పార్లమెంటరీ పార్టీలను చీల్చింది. అందులో తెలుగుదేశం ఒకటి. అలాగే జార్ఖండ్ ముక్తిమోర్చా లాంటి పార్టీలకు చెందిన సభ్యులెందరినో కొన్నారు. ఇప్పటికీ ఆ కేసు కోర్టుల్లో అంతం లేకుండా అలాగే కొనసాగుతోంది. అంతటితో ఆగక సుప్రీంకోర్టు ఒక విచిత్రమయిన తీర్పునిచ్చింది. డబ్బుకు అమ్ముడుపోయిన చట్టసభ సభ్యుడు అవినీతికి పాల్పడట్టు కాదట! ఎందుకంటే సభలో అతడు వేసే ఓటును గురించి ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదట! డబ్బు తీసుకుని ఓటు వేసినట్టు సాక్ష్యం ఉన్నా అది అతడి హక్కట! కానీ డబ్బిచ్చి ప్రలోభపెట్టినవాడు మాత్రం నేరస్తుడట! ఇదీ ప్రస్తుతం మన దీనస్థితి. పార్టీ ఫిరాయింపుల చరిత్రలో ఓ గొప్ప మలుపు ప్రస్తుత ఉత్తరప్రదేశ్ శాసనసభలో జరిగిన సంఘటనలు. అక్కడ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నుంచి ఫిరాయించి లోక్ తాంత్రిక్ కాంగ్రెస్‌ను నెలకొల్పి బీజేపీ ప్రభుత్వంలో చేరారు. అలా పార్టీ ఫిరాయించిన ప్రతి సభ్యుడూ మంత్రి అయ్యాడు! బహుజన సమాజ్ పార్టీకి చెందిన 54మంది సభ్యులలో 12మంది ఫిరాయించి, అందరూ మంత్రులయ్యారు. అక్కడి శాసనసభ స్పీకర్ కేసరినాథ్ త్రిపాఠి కొత్త గణితాన్ని సృష్టించారు. 54లో మూడోవంతు అంటే కనీసం 18మంది కావాలి. లోపభూయిష్టమైన ప్రస్తుత చట్టం ప్రకారం కూడా 54మందిలో 12మంది పార్టీ ఫిరాయిస్తే వాళ్ల సభ్యత్వం రద్దు కావాలి. దాన్ని విచారించి సభ్యత్వం రద్దయినట్టే ప్రకటించవలసింది స్పీకర్. కానీ ఉత్తరప్రదేశ్ స్పీకర్ 54మందిలో 12మంది ఫిరాయించినా దాన్ని 'కొనసాగుతున్న చీలిక'గా భావించవచ్చునని, 18 అయ్యేదాకా వాళ్లకి ఫిరాయింపునకు పూర్తి అవకాశమివ్వాలని అతిహేయమైన తీర్పునిచ్చి కొత్త గణితాన్ని సృష్టించారు! సరే, ఇలా పార్టీలు ఫిరాయించినవాళ్లకు పెద్దపీట వేసి మంత్రిపదవులిచ్చి, అసలు పార్టీలో వారికి పదవులివ్వలేదన్న అక్కసు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని సంక్షోభానికి కారణమయింది. అది వేరే కథ.

52వ సవరణ పార్టీ ఫిరాయింపులని ఆపలేకపోగా, మరో ఉపద్రవాన్ని తెచ్చిపెట్టింది. ఈ చట్టంలో ఓ సభ్యుడు ఎలాంటి అంశంపైనయినాసరే తన మనసుకు నచ్చినట్టుగా ఓటు వేసే అవకాశం లేదు. ప్రభుత్వ మనుగడతో సంబంధం లేకపోయినా, ఆ సభ్యుడికి ధర్మాధర్మ విచక్షణావకాశం లేదు. అంటే చట్టసభ సభ్యుల్ని గొర్రెల మందలాగా చేసింది 52వ రాజ్యాంగ సవరణ. ఇక ఆ సభ్యులు ఉన్నా లేకపోయినా తేడా లేదు! పార్టీ నాయకత్వం ఏ అంశంమీదనయినాసరే ఎంతటి విపరీత నిర్ణయం తీసుకున్నా, దాన్ని చట్టసభ సభ్యులు విధిగా ఆమోదించి సభలో సమర్థించవలసిందే! లేదంటే వాళ్ల సభ్యత్వం రద్దవుతుంది. ఈ కారణంగానే రాజీవ్‌గాంధీ అనాలోచితంగా, ముస్లిం మతఛాందసులను తృప్తిపరచటానికి ప్రవేశపెట్టిన "ముస్లిం మహిళల పోషణ బిల్లు"ను ఆ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు సమర్థించవలసి వచ్చింది. ఆ దారుణమయిన బిల్లుపై వ్యక్తమయిన నిరసనను చల్లార్చడానికి, హిందూ ఛాందసులను తృప్తిపరచటానికి ప్రభుత్వం అయోధ్యలో శిలాన్యాసాన్ని చేపట్టవలసి వచ్చింది. ఎంతోకాలంగా నిద్రాణంగా ఉన్న మందిర్ మసీదు వివాదం వెలుగులోకి వచ్చి దేశానికి, సమాజానికి అపారనష్టం కలగజేసింది. కాంగ్రెస్ ఎంపీలకే ఓటింగ్‌లో స్వేచ్ఛ ఉంటే ఆనాటి ముస్లిం మహిళల బిల్లు సభలో వీగిపోయేది! సుప్రీంకోర్టు జడ్జి రామస్వామిపై అభిశంసన తీర్మానంపైన ఓటింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేయటం బహుశా మన పార్లమెంటరీ చరిత్రలో అత్యంత విషాదకర పరిణామం. ఓ న్యాయమూర్తిని అభిశంసించే తరుణంలో పార్లమెంటు ఓ న్యాయస్థానంలా వ్యవహరించాలి. సాక్ష్యాల్ని పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి ప్రతి సభ్యుడూ నిజాయతీగా నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే రాజ్యాంగాన్ని పార్లమెంటు పరిరక్షించినట్టవుతుంది. అలాకాక, కాంగ్రెస్ సభ్యులందరూ ఓటింగ్‌లో పాల్గనరాదని విప్ జారీచేయటంతో ఆనాటి అభిశంసన వీగిపోయింది! ఆ ఒక్క అనాలోచితమయిన, నీతిబాహ్యమయిన చర్య వల్ల రాజ్యాంగసంస్థల జవాబుదారీతనం అసాధ్యమయిపోయింది. ఇలా లోతుగా పరిశీలిస్తే తేలేదేమంటే, 52వ రాజ్యాంగ సవరణ వల్ల ఒక వంక పార్టీ ఫిరాయింపులు, ప్రజాస్వామ్య ఖననాలు యధేచ్ఛగా జరిగిపోతుండగా, మరోవంక సభ్యుల స్వేచ్ఛకు సంకెళ్లు పడి వారు పార్టీ నాయకత్వం చేతిలో బానిసలుగా మారిపోయారు. ఇప్పటికే పార్టీలు నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుండగా 52వ రాజ్యాంగ సవరణ మన ప్రజాస్వామ్యాన్ని మరింత అప్రదిష్టపాలు చేసింది.

**సమూల సంస్కరణలకు నడుంకట్టాలి**

ఏవిధంగా పరిశీలించినా పార్టీ ఫిరాయింపులను ఆపటానికి, అదే సమయంలో చట్టసభలలో భావప్రకటన స్వేచ్ఛగా ఉండేలా చేయటానికి చట్టంలో మౌలిక సవరణలు

తేవాలి. ఒంటరిగానైనా, గుంపుగానైనా పార్టీలు మారడాన్ని నిషేధించాలి. ఎంతమంది అయినా సరే ప్రభుత్వ మనుగడ విషయంలో పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తే వాళ్ల సభ్యత్వం తక్షణం రద్దుకావాలి. ఈ రద్దు చేసే అధికారం స్పీకర్‌కు కాక, ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. నిజంగానే మౌలికమయిన అంశాలలో విభేదాల వల్ల చీలిక వస్తే, అప్పుడు పార్టీ నాయకత్వాన్ని వ్యతిరేకించినవారికి రక్షణ ఏమిటి? అందుకు పకడ్బందీగా చట్టాన్ని తేవాలి. అకస్మాత్తుగా గవర్నరు దగ్గరకో, రాష్ట్రపతి దగ్గరకో పోయి పార్టీలో చీలిక వచ్చిందంటే దాన్ని ఎట్టి పరిస్థితులలోనూ ఆమోదించరాదు. ఓ పార్టీలో చీలిక వస్తే, ప్రతిపాదితులు కనీసం నెలరోజుల బహిరంగ నోటీసుతో రావాలి. ఆ పార్టీ సర్వసభ్య సమావేశం, పార్టీ నిబంధనల మేరకు నెలరోజుల బహిరంగ నోటీసు తరువాత అది జరగాలి. ఆ సభలో ఎన్నికల సంఘం ప్రతినిధులు పరిశీలకులుగా పాల్గొనాలి. అక్కడ కనీసం మూడోవంతు సభ్యులు విధానాల కారణంగా పార్టీ చీలికను ప్రతిపాదించాలి. నాయకత్వ మార్పుని ఆశిస్తే, ఆ ఎంపిక అక్కడ ఎన్నిక ద్వారా తేలాలిగానీ, చట్టబద్ధంగా చీలిక కారణంగా కారాదు. అంటే నాయకత్వం మార్పు కోసం పార్టీ చీలికను నిషేధించాలి. బలమయిన కారణాల వల్ల బహిరంగంగా చీలిక వస్తే, ముందుగా ఎన్నికల సంఘం దాన్ని గుర్తించాలి. ఆ పిదప స్పీకర్‌కు బహిరంగంగా కనీసం మరో నెల ముందు నోటీసు ఇచ్చి ఆ పార్టీలో చీలిన సభ్యులు విప్‌కు వ్యతిరేకంగా ఓటు చేయవచ్చు. కానీ అలా ఓటు వేసే సభ్యులకు ఆ సభ పదవీకాలం మొత్తంలో మంత్రిపదవులు మరే ఇతర పదవులు పొందే హక్కు ఉండరాదు. ఇలా పకడ్బందీగా చట్టాన్ని చేస్తే, అటు పార్టీలలో ప్రజాస్వామ్యం బలపడుతుంది, ఇటు డబ్బు కోసం, పదవి కోసం ఫిరాయింపులను నిషేధించవచ్చు. అదేసమయంలో పార్టీ విప్‌ను ప్రభుత్వ మనుగడను నిర్దేశించే అంశాలకు మాత్రమే పరిమితం చేయాలి. అంటే ఓ ప్రభుత్వంపై అవిశ్వాస, విశ్వాస తీర్మానం, బడ్జెట్‌పై లేదా ఆర్థిక బిల్లుపై ఓటింగ్ వంటి అంశాలకు మాత్రమే విప్‌ను పరిమితం చేయాలి. ఈ అంశాలపై ఓటింగ్ ఫలితాల ద్వారా మాత్రమే రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం పతనమవుతుంది. మిగిలిన అన్ని అంశాలలోను సభ్యులకు తమ అభీష్టానుసారం ఓటు వేసే హక్కుండాలి. కొందరు సభ్యులు ఓ ప్రభుత్వ విధానంపై పార్టీ ప్రతిపాదనను కాదంటే, వారిని వాదనతో, వాస్తవాల ఆధారంగా బహిరంగ చర్చతో ఒప్పించాలి తప్ప బెదిరింపులతో, నిరంకుశత్వంతో, పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంతో కాదు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల వల్ల ఒక వంక, చట్టసభ సభ్యుల బానిసత్వం వల్ల మరోవంక మన ప్రజాస్వామ్యానికి భరించరాని కీడు జరిగింది. ఇప్పటికయినా అన్ని పార్టీలూ కళ్లు తెరిచి సవ్యమైన సంస్కరణల కోసం నడుంకట్టాలి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఈనాడు దినపత్రిలో జులై 5, 1999న ప్రచురితమైన వ్యాసం)


## FORM IV

1. Place of Publication : Hyderabad
2. Periodicity of its publication : Fortnightly
3. Printer's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
4. Publisher's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
5. Editor's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)
6. Name and address of individual who own the news paper : Dr. Jaya Prakash Narayan
   Indian
   Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P)

and partners or shareholders holding More than one per cent of the total capital NA

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knownledge and belief

Date : 16 March 2016 (Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher

# కావలిలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయం ప్రారంభం




రానున్న రోజుల్లో లోక్‌సత్తాను బలమైన శక్తిగా తయారుచేయాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ నేత నాగేంద్రబాబు అన్నారు. కావలిలో స్థానిక రామ్మూర్తిపేట సాయిబాబా మందిరం పక్కన లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇక్కడ కార్యాలయం ప్రారంభించటం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపుతుందన్నారు. 'లోక్‌సత్తా.. ఇది మీ సత్తా' అంటూ ఇక్కడ నిర్వహించే ప్రజాకార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకూ ఆదర్శం కావాలన్నారు. త్వరలో విజయవాడలో కూడా రాష్ట్ర కార్యాలయం ప్రారంభించి పార్టీ కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. అనంతరం నియోజకవర్గ ఇంఛార్జి గడ్డం సతీష్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి నాయకుడూ కార్యకర్తలా పనిచేసినప్పుడే పార్టీ విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో తెదేపా, వైకాపాలతో విసిగిన ప్రజలు త్వరలోనే లోక్‌సత్తా ప్రత్యామ్నాయాన్ని గుర్తిస్తారన్నారు. పార్టీ సలహాదారు సీపీ బాబూరావు, జిల్లా నేత నెల్లూరు నరసయ్య, లావణ్య, రవి, మాలకొండారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జలవనరుల సుస్థిర నిర్వహణకు రెండు కొత్త బిల్లులు తెస్తున్న కేంద్రం

జల వినియోగం, నిర్వహణకు సంబంధించి రెండు కీలక బిల్లులకు కేంద్ర ప్రభుత్వం తుదిరూపు ఇవ్వనుంది. జల వనరుల సుస్థిర నిర్వహణకు, సంస్కరణలకు శ్రీకారం చుట్టటానికి ఈ రెండు బిల్లుల్నీ తీసుకురానున్నట్టు కేంద్రం పేర్కొంది. రాష్ట్రాల మధ్య సహకారం, నదులవారీగా సమీకృత నీటి అభివృద్ధి, వివాదాల పరిష్కారం, నీటి నియంత్రణ కోసం నదీప్రాంత యాజమాన్య (రివర్ బేసిన్ మేనేజ్‌మెంట్) బిల్లును తేనుంది. భూగర్భ జల సంరక్షణ, అభివృద్ధి, నియంత్రణకు జాతీయ జల ప్రణాళికా (నేషనల్ వాటర్ ఫ్రేమ్‌వర్క్) బిల్లుకు రూపకల్పన చేసింది. ఈ బిల్లులకు సంబంధించిన ముసాయిదాను ఇటీవల జరిగిన జలమంథన్ సదస్సులో చర్చించిన కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ, ఈ నెలాఖరులోగా ముసాయిదాలకు తుదిరూపం ఇచ్చి రాష్ట్రాలకు పంపనుంది. నీటి అంశం రాష్ట్రానికి సంబంధించినదే అయినా జాతీయ స్థాయిలో ఓ విధానాన్ని తేవాల్సిన అవసరాన్ని ఇందులో పేర్కొన్నారు. రాష్ట్రాలకు చట్టాలు చేసే సామర్థ్యమున్నా, ప్రస్తుతం దేశంలో ఉన్న 300కిపైగా ఉన్న చట్టాలు ఇప్పటి జలవనరుల అవసరాలకు తగ్గట్టు లేవని కేంద్రం పేర్కొంది. జలవిధానంపై రాష్ట్రాలతో సంప్రదించినప్పుడు జల సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లటానికి కేంద్రం చొరవ చూపాలని కోరాయని, జాతీయ దృక్పథంతో ప్రాథమిక సూత్రాలలో మార్పులు తెచ్చేందుకు కొత్త బిల్లులు తెస్తున్నట్టు కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ తెలిపింది. జాతీయ జలచట్టం తేవాలని 12వ ప్రణాళికా సంఘం కూడా సూచించిందని గుర్తుచేసింది. ఇందులో భాగంగా స్థానిక నీటి పరిస్థితిని స్థానిక సంస్థలు పరిష్కరించేలా ప్రతి రాష్ట్రం అధికారాలను వికేంద్రీకరించేలా జాతీయ జల ప్రణాళికా బిల్లు రానుంది. ప్రజల భాగస్వామ్యంతో జలవనరుల్ని అభివృద్ధి చేయటం, స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థను (రెగ్యులేటరీ అథారిటీ) ఏర్పాటు చేయటం, ప్రతి ఒక్కరికీ సమానంగా నీటి సరఫరా జరిగేందుకు తాగునీటితోపాటు వ్యవసాయ, పారిశ్రామిక నీటిసరఫరాకు మీటర్లు పెట్టటం, ప్రజల భాగస్వామ్యంతో భూగర్భ జలాలను పరిరక్షించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవటం లాంటివి బిల్లుల్లో ఉన్నాయి. మొత్తం 12 నదీప్రాంత అథారిటీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో గోదావరి, కృష్ణా, కావేరి, గంగ, మహానది, నర్మద, పెన్నా, బ్రాహ్మణి-బైతరిని, ఇండూస్, మహి, తపి, సుబర్నేఖ నదీ ప్రాంతాలున్నాయి. ఈ అథారిటీలో భాగంగా ఏర్పాటు చేసే గవర్నింగ్ కౌన్సిల్‌లో నదీప్రాంత పరిధిలోని రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో రాష్ట్రాల ముఖ్యకార్యదర్శులుంటారు. ప్రతి నదీ ప్రాంత అథారిటీ ఓ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలుచేయాల్సి ఉంటుంది. ఈ బిల్లులు అమల్లోకి వస్తే నీటిపై ప్రత్యక్షంగా కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

# సొసైటీలో మోసపోయినవారిని ఆదుకోవాలి



సమాజంలో పేద, మధ్యతరగతి వర్గాలు, ముఖ్యంగా రైతులు స్వతంత్రంగా ఎదగటానికి దోహదం చేసే సహకార వ్యవస్థను రాజకీయ నేతలు నాశనం చేశారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. బినామీ రుణాలు తీసుకుని తప్పుడు లెక్కలతో సంఘాలను నాయకులు ముంచుతున్నా, సహకార వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా చేసి కబ్జా చేయటానికే పాలకులు ప్రయత్నిస్తున్నా రన్నారు. విజయనగరం పట్టణంలో విజయ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డు తిప్పేయటం వల్ల వందలమంది డిపాజిట్‌దారులు తమ సొమ్మును కోల్పోయి లబోదిబోమంటున్నారని, వారిని ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాబ్జీ జిల్లా కలెక్టర్ ఎంఎం నాయక్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. 79 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన విజయా సొసైటీ మూతపడి తొమ్మిదేళు కావస్తున్నా డిపాజిట్‌దారులకు సొమ్ము చెల్లించలేదన్నారు. చాలామంది డిపాజిట్‌దారులు ఇప్పటికే మరణించారన్నారు. ఖాతాలో మిగిలిన సొమ్ముతోపాటు లిక్విడేటర్‌ని నియమించి డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలకు రాష్ట్ర స్థాయి అధికారులకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చినట్టు బాబ్జీ తెలిపారు. లోక్‌సత్తా కృషితో వచ్చిన 97వ రాజ్యాంగ సవరణ వల్ల సహకార వ్యవస్థ స్వయంప్రతిపత్తికి భరోసా లభించిందని, రాష్ట్రంలో రైతులకు అవసరమైన పరపతి, మార్కెటింగ్ వ్యవస్థలను ఏర్పరిచేందుకు సహకార రంగాన్ని పెద్దఎత్తున బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిపాజిట్‌దారుల సంఘం ప్రతినిధులు సీతారాం, మోహన్, రాము, సంతోష్, భాస్కర్ తదితరులు కలెక్టర్‌ని కలిసిన బృందంలో ఉన్నారు.

# దొరసానమ్మ సాహసం స్ఫూర్తిదాయకం, యువత బలికాకుండా పెద్దలక్ష్యాల కోసం పనిచేయాలి

అర్జెంటీనాలోని ఎత్తయిన ఆండిస్ పర్వతాన్ని అధిరోహించి తన తమ్ముడు మస్తాన్‌బాబు మరణించిన చెర్రోట్రస్ట్‌క్రోసెస్ వద్ద ముువ్వన్నెల పతాకం, సైనిక స్కూల్ పతాకం, రాఖీ ఉంచి నివాళులర్పించిన మల్లి దొరసానమ్మ సాహసం, లక్ష్యసాధన యువతకు స్ఫూర్తిదాయకమని బాబ్జీ అన్నారు. పౌరవేదిక తరపున విజయనగరంలో బెస్ట్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, కోరుకొండ సైనిక్‌స్కూల్ విద్యార్థి అయిన మస్తాన్‌బాబు ప్రపంచంలోని అనేక ఎత్తయిన శిఖరాలను అధిరోహించి దురదృష్టవశాత్తూ మార్చి 24న ఆండిస్ మంచుపర్వతంలో మరణించారని, సోదరుడి ఆశయాన్ని దొరసానమ్మ నెరవేర్చిందని అన్నారు. యువత పెద్ద లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి కోసం పట్టుదలతో కృషి చేయాలని, బలికాకుండా వాటిని సాధించాలని అన్నారు. మస్తాన్‌బాబు, దొరసానమ్మలాంటి వారి ఆశయాలు ఎప్పుడూ యువతకు ఉత్సాహాన్నిస్తుంటాయని వేదిక అధ్యక్షుడు ఎంఎస్ కామేశ్వరరావు అన్నారు. సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ బీపీ రావు, వేదిక ప్రతినిధులు ఎల్‌కే జైన్, ఆర్. సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వీఎన్ గురుప్రసాద్, మజ్జి కాంతారావు, చదలవాడ ప్రసాద్, భాస్కర్, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌలు రైతు చట్టం అమలు చేయాలి : లోక్‌సత్తా



కౌలురైతు చట్టం అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సాతులూరి గోవిందరావు డిమాండ్ చేశారు. మే 15లోగా కౌలుదారులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలన్నారు. మిర్యాలగూడ స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన లోక్‌సత్తా నియోజకవర్గ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ, కౌలుదారులు గుర్తింపు కార్డులు పొందే విధానంపై స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పించాలన్నారు. కౌలురైతుల చట్టం ప్రకారం, గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు అందే ఏర్పాటు చేయాలన్నారు. వీరికి ఇచ్చే గుర్తింపు కార్డులు కనీసం మూడేళ్లపాటు చెల్లుబాటయ్యే విధంగా ఉండాలన్నారు. సాధారణ రైతులకు అందే అన్ని సౌకర్యాలూ కౌలుదారులకూ అందించాలన్నారు. కౌలుదారులంటే రైతులేనని లోక్‌సత్తా తొలినుంచీ స్పష్టం చేస్తోందన్నారు. రాష్ట్రంలో పెద్దఎత్తున కరవు పరిస్థితులున్నా పాలకులు తగురీతిలో స్పందించటంలేదని, కరవు మండలాలుగా ప్రకటించిన చోట కూడా సహాయక చర్యలు లేవన్నారు. సమావేశానికి లోక్‌సత్తా నియోజకవర్గ అధ్యక్షుడు బెలిదె వీరప్రతాప్ అధ్యక్షత వహించగా, నంగునూరి వెంకటేశ్వర్లు, లావణ్య, గొట్టె సైదులు, విశ్వనాథుల రమేష్, శంకర్‌రెడ్డి, రఫి, యాదగిరి తదితర నేతలు పాల్గొన్నారు.

**స్పందించిన జిల్లా యంత్రాంగం**

కౌలురైతులకు రుణ అర్హత కార్డులను మంజూరు చేయాలని ఇంఛార్జి కలెక్టర్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర మండలస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో గ్రామాలవారీగా గుర్తించిన కార్డులను పరిశీలించి నూతన కార్డులను మంజూరు చేయాలని, ఈ విషయంలో రెవిన్యూ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. లోక్‌సత్తా కొంతకాలంగా చేస్తున్న డిమాండ్ పట్ల జిల్లా యంత్రాంగం స్పందించటం పట్ల గోవిందరావు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో తగ్గిన ఆహారధాన్యాల దిగుబడి

లోటు వర్షపాతం, దిగజారిన భూగర్భ జలమట్టం, దిగుబడులలో కొరత వల్ల తెలంగాణలో ఈ ఏడాది కూడా పంట ఉత్పత్తులు బాగా తగ్గనున్నాయి. వరసగా నాలుగో సీజన్‌లో పంట దిగుబడులు తగ్గటం ఆందోళనకలిగిస్తోంది. వ్యవసాయంపై తెలంగాణ ఆర్థిక, గణాంకాల డైరెక్టొరేట్ రూపొందించిన నివేదిక ప్రకారం, ఆహారోత్పత్తుల, ముఖ్యంగా ధాన్యం దిగుబడులు బాగా తగ్గుతున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు దక్షిణభారతదేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న తెలంగాణ ప్రస్తుతం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సరైన వర్షాలు లేకపోవటం, భూగర్భ జలాలు ఇంకిపోతుండటం వల్ల 2014 ఖరీఫ్ నుంచి వ్యవసాయంలో ఒడిదుడుకులు మొదలయ్యాయి. దీనికితోడు గ్రామీణ తెలంగాణలో విద్యుత్ సరఫరా లోటు కూడా ఉండటంతో రైతులు 2014 నుంచి ఖరీఫ్, రబీ పంటల ఉత్పత్తిలో తీవ్రంగా నష్టపోతున్నారు. సాగు విస్తీర్ణం కూడా తగ్గుముఖం పట్టింది. భూగర్భ జలాలను ఎత్తిపోయటానికి ఇంకా ఎక్కువ విద్యుత్తు అవసరమవుతోంది. 2013-14 ఖరీఫ్ సీజన్‌లో 65.28 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తికాగా, 2014-15లో 44.72 లక్షల టన్నులకు పడిపోయింది. ఈ తగ్గుదల 31.5శాతం. ధాన్యంతోపాటు, మొక్కజొన్న, కంది, పెసర దిగుబడులు కూడా తగ్గాయి. రబీ సీజన్‌లో కూడా 2013-14లో 41.58 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తికాగా, తర్వాతి ఏడాదిలో 33.96శాతం తగ్గింది.

# సేంద్రియ సాగుకి కేంద్ర ప్రభుత్వ భారీ ప్రోత్సాహం

రసాయన ఎరువుల మితిమీరి వాడకం నుంచి రైతులను బైటపడవేసేందుకు సేంద్రియ పద్ధతులతో వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం అందుకోసం తాజా బడ్జెట్‌లో 5లక్షల ఎకరాల్లో వ్యవసాయ కుంటలు, బావులు, మరో 10లక్షల ఎకరాల్లో కంపోస్టు ఎరువు గుంతలు తవ్వేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించింది. దశలవారీగా సాగువిస్తీర్ణాన్ని పెంచుతూ తొలిదశలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని కూడా అందించాలని కేంద్రం భావిస్తోంది. సేంద్రియ సాగు పెంచటం లక్ష్యంగా ఇటీవల సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌లో రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, వ్యవసాయ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరై దిశానిర్దేశం చేసిన సంగతి తెలిసిందే.

ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రాతిపదికగా రూపొందించిన కేంద్ర ప్రభుత్వ సేంద్రీయ వ్యవసాయ విధానంలోని ముఖ్యాంశాలు:

- రైతులను దశలవారీగా సేంద్రీయ సాగు వైపు మళ్లించాలి
- ప్రతి జిల్లాలో ఇప్పటికే కొందరు సేంద్రియ వ్యవసాయం చేస్తూ లాభాలు గడిస్తున్నారు. వారి చుట్టుపక్కల మరికొందరిని ఎంపికచేసి ఒక క్లస్టర్ పద్ధతిలో ఒక ప్రాంతమంతా సేంద్రియ ఎరువులు, జీవ కీటక నాశనుల వినియోగంతో పంటల సాగును ప్రోత్సహించాలి
- ఇప్పటికే ఈ విధానం అమలుకు 'పరంపరాగత్ కృషి వికాస్ యోజన' (పీకేవీవై) పథకం కింద తెలంగాణలో రూ.15 కోట్లు కేటాయించారు. వచ్చే ఖరీఫ్ నుంచి పంటల సాగు ప్రారంభించేందుకు 300 క్లస్టర్లు ఏర్పాటు చేయాలి



- సేంద్రియ విధానంలో పంట సాగు ప్రారంభించాక వరసగా మూడేళ్లు సాగుచేస్తేనే ఆ భూమి పూర్తిగా రసాయనాలు లేకుండా పంటనిచ్చే స్థాయికి చేరుతుంది. తొలి ఏడాది దిగుబడి తక్కువ వచ్చినా ఆ నష్టాన్ని పూడ్చేందుకు రైతులకు రాయితీలిస్తారు
- రసాయనాలు లేకుండా పండించే పంటకు సాధారణ పంటలకన్నా అధిక ధర ఇప్పిస్తామనే భరోసాను రైతులకు కేంద్రం ఇవ్వాలి
- రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి ఈ పంటల సాగును ప్రోత్సహించాలి
- పంటల విక్రయానికి రైతుల సంఘాలతో 'వ్యవసాయోత్పత్తుల కంపెనీ' ఏర్పాటు చేయించాలి.

# తెలంగాణలో విత్తనాభివృద్ధికి ఇక్రిశాట్ సహకారం

రైతుల భాగస్వామ్యంతో తెలంగాణను విత్తన భాండాగారంగా అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి చేయూతనిస్తామని ఇక్రిశాట్ (అంతర్జాతీయ ఉష్ణమండల, మెట్టపంటల పరిశోధనా కేంద్రం) తెలిపింది. విత్తన పంట రైతుల కంపెనీ (ఎఫ్‌పీఓ)ల ఏర్పాటుకి కార్యాచరణ ప్రణాళికను తయారుచేసి వ్యవసాయ శాఖకు అందచేసింది. వ్యవసాయ శాఖతో కలిసి విత్తన రైతులకు అన్ని విధాలా తోడ్పాటునందిస్తామని, విత్తనోత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సాంకేతిక సహకారాన్ని అందిస్తామని ఇక్రిశాట్ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. ఇందుకోసం జిల్లాలవారీగా విత్తన పంటల్ని ఎంపిక చేస్తారు. సిబ్బందికి, రైతులకు శిక్షణతో పాటు మార్కెటింగ్ అవకాశాలను సమన్వయం చేసే బాధ్యతను కూడా ఇక్రిశాట్ నిర్వరిస్తుంది.

# పల్లె వలసల పాపం పాలకులదే

- అరుణ ఎ హాకిన్స్



గత ప్రభుత్వాలు చేసిన తప్పిదం వల్ల రాయలసీమ ప్రాంతం నెల్లూరు జిల్లాలో కరవుకాటకాలు రైతుల్ని కాటు వేస్తున్నాయి. రాష్ట్రానికి ఆహారధాన్యాలు సమకూర్చే రైతుకు కన్నీళ్లు మిగిల్చాయి. వర్షాధార భూముల్లో కొన్ని ప్రాంతాలు ఎప్పటికీ బీడు భూములుగానే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం రైతుల్ని నిర్లక్ష్యం చేస్తోందని అడిగితే, "వరుణుడు కరుణించలేదు, ఏం చేస్తాం?' అంటూ నేరాన్ని ప్రకృతికే ఆపాదిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు గురించి ఆలోచించటం లేదు పాలకులు, అధికారులు. అప్పులపాలై పంటలు పండక రైతులు గ్రామాలు వదిలిపెట్టి పట్టణాలకు నగరాలకు వలసపోతున్నారు. యువకుల నుంచి మధ్యవయసు వారి వరకూ లక్షల సంఖ్యలో ఎక్కడికైనా దూరప్రాంతాలకు వెళ్లి కాయకష్టం చేసుకుంటున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు గ్రామాలలో మిగిలారు. కొందరైతే పసిబిడ్డలను వృద్ధులైన తల్లిదండ్రుల వద్ద విడిచి గుండె రాయి చేసుకుని కన్నీటితో తరలిపోతున్నారు. ఆ దృశ్యాలు కఠిన హృదయులను కూడా కలచివేస్తున్నాయి. అయిదు నుంచి పది సంవత్సరాల వయసువారికి చదువు లేదు. వృద్ధులు పసివారిని సాకలేరు కనక ఇంటి పని భారమంతా వీరి మీదనే పడుతోంది. ఇక బడికి ఎలా వెళ్లగలరు? ఆడుతూపాడుతూ గడపాల్సిన బాల్యం.. బరువు బాధ్యతల మధ్య నలిగిపోతోంది.

గతంలో చిత్తూరు, కడప, నెల్లూరు రాయలసీమవాసులు ముఖ్యమంత్రులుగా పనిచేసినా వారి సొంత జిల్లాలు కరవుతో అల్లాడిపోతూనే ఉన్నాయి. నేతలుగా తమకు తామే డిక్లేర్ చేసుకుని ఎన్నికలప్పుడు ఓటు వేయించుకున్న వారంతా ఎటు పోతారో మళ్లీ ప్రజలకు కనిపించరు. ప్రజల సమస్యలను తీర్చేస్తే మళ్లీ ఎలక్షన్ల టైంకి వాగ్దానాలు మిగలవన్నట్టు వ్యవహరిస్తారు. అందువల్ల ఎప్పటికప్పుడు భ్రమలు కొల్పే వాగ్దానాలు కొత్తదనంతో ఎక్కడ నుంచి వస్తాయని కాబోలు, విపరీతమైన మతిమరుపుతో గడుసుదనంతో గడిపేస్తుంటారు. అమాయకులైన ప్రజలు అలా అమాయకంగానే ఉండిపోవాలి. చదువు, తెలివీ, తిండీబట్టా, ఆరోగ్యం అమర్చిపెడితే వాళ్లెక్కడ డబ్బుకు అమ్ముడుపోతారు? కనక వాళ్లను అలాగే సమస్యల మధ్య వదిలేస్తుంటారు. మరెలా నాయకులు గెలుస్తున్నారు?

మద్యం, డబ్బు ఎరవేయడం వలన. బీదవాళ్లు వచ్చించే చాలని తలవంచుతున్నారు. అవి కూడా చాలకపోతే ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం, భాష అంటూ చిచ్చుపెడతారు. ఈ మధ్య రాజకీయ నాయకులకు అతి తెలివితేటలు పుట్టుకొచ్చాయి. ప్రజలకి డబ్బు ఇచ్చి ఓటు కొనుక్కోవడం కంటే అభ్యర్థినే కొనేసుకుంటే పోదూ, అసలు ఎన్నికే అవసరం ఉండదు అని! ఆ తర్వాత గెలిచాక కొనేయటం మరో పద్ధతి. కానీ ఇందుకు కూడా జనం నుంచి కొట్టేసిన సొమ్మే అయినా కాస్త ఎక్కువ ఖర్చవుతుంది. ఈ విషయాల్ని త్వరలోనే ప్రజలు గ్రహించేస్తారు. అప్పుడు ఏం జరుగుతుందో కాస్త వేచిచూద్దాం.

ఏ ప్రాంతాలు కళకళలాడుతున్నాయి, ఏ ప్రాంతాలు కరవుకాటకాల్లో అల్లాడుతున్నాయో తెలియనది కాదు. గ్రామాల దత్తత అనే అంశంతో కొద్దిపాటి కదలిక వచ్చింది. మొహమాటానికో, తప్పనిసరయ్యో, నిజంగానో, నిజాయతీగానో.. ఏమైతేనేం కొంత దిద్దుబాటు మొదలైంది. అయితే బిలియన్ల నల్లధనం బైటికి తెచ్చి పంచుతామని ఢిల్లీ గద్దెనెక్కినవారు మాట నిలబెట్టుకుని ఆ ధనాన్ని తెప్పిస్తే, అంతకంటే ముఖ్యంగా దేశం నుంచి ఇకనైనా నల్లధనం బైటికి పోకుండా అడ్డుకుంటే అన్ని గ్రామాలూ బాగుపడతాయి. ఆధ్యాత్మిక గురువులు, సన్యా(న్నా)సుల దగ్గర భక్తి ముసుగులో డబ్బు మూలగటం ఆధునిక పరిణామం. షిర్డీ సాయి, రమణ మహర్షి, చంద్రశేఖరానంద సరస్వతి, రంగనాధానంద స్వామి వంటి వారి నిరాడంబర జీవితానికి పూర్తి విరుద్ధంగా ఇప్పుడు ఆధ్యాత్మికత ఒక విలాసవంతమైన వ్యాపారంలా తయారైంది. చెప్పటానికి విషయం లేకపోయినా కీర్తికండూతితో ఛానళ్లు పెట్టుకుంటున్న స్వాములకు కొదవలేదు. కుళ్లు రాజకీయాలతో పాటు ఈ స్వామీజీల సంస్కృతిని కూడా ప్రక్షాళన చేసి నిజమైన ఆధ్యాత్మికతను సమాజానికి అందించాల్సి ఉంది. విచిత్రం, ఈ స్వాములెవరూ గ్రామాలను పేదరికం, పెత్తందారీతనం నుంచి విముక్తి చేసి బాగుచేసే ప్రయత్నం చేయరు. తమ మంత్రదండాలను, పలుకుబడిని గ్రామాల పునరుజ్జీవనానికి వినియోగించరు. ఈ స్వాముల దగ్గరున్న సంపదను బైటికి తీసుకురాగల సత్తా ఏ ప్రధాని వద్దా కనిపించటం లేదు. కరవును మాయం చేయటానికి చాలా చేయాలిగానీ చట్టవిరుద్ధంగా, అనైతికంగా దాచిన డబ్బుని బైటికి తీస్తే చాలా ఉపయోగపడుతుంది.

ఆమధ్య ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తుంటే, విజయవాడలో ట్రైన్ ఎక్కిన కొంతమందితో మాటామంతీ జరిగింది. అమెరికా వెళ్లాలని కలలుగనే యువత కొందరు, 1500 ఎకరాల భూమి వర్షం లేక బీడుపోతే ఏం చేయాలో తెలీక కౌలుకిచ్చేసి పిల్లల దగ్గరికి వెళుతున్న రైతులు ఇంకొందరు వారివారి సమస్యలు చెప్పారు. రాయలసీమలోనే కాదు కరవు క్రమంగా బంగారం పండే భూములున్న ప్రాంతంగా పేరు తెచ్చుకున్న కృష్ణా జిల్లా గ్రామాలకు కూడా దాపురిస్తోందని అర్థమైంది. వర్షాభావాన్ని అధిగమించే అవకాశాలను ప్రయత్నించకపోవటం, పంటపండినా లాభసాటి కాకపోవటం వల్ల వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇక అణగారిన, పేద వర్గాలు కౌలుదారులుగా పడుతున్న కష్టాలు ఇంకోరకంగా దుర్భరమైనవి. వీళ్లువాళ్లు అని తేడా లేకుండా వ్యవసాయం చేసే వారంతా యాచకుల్లా బతికే పరిస్థితిని మనం ఎన్నుకుంటున్న ప్రభుత్వాలు కల్పించాయి.

కష్టపడే రైతులు, సి. సుబ్రమణ్యం స్ఫూర్తిదాయక సారథ్యం, బి.ఎన్ శివరామన్ అకుంఠిత దీక్షాదక్షతలు, నార్మన్ బోర్లాగ్ నిర్దేశకత్వం, దేశవ్యాప్తంగా అసంఖ్యాక శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషి కారణంగా ఆహారరంగంలో మనదేశం స్వావలంబన సాధించింది. మిగులు ఆహారధాన్యాల ఎగుమతుల కోసం లోక్‌సత్తా చేసిన పోరాటం వల్ల దేశానికి, రైతులకు ఆదాయం మెరుగైంది. ఇదేసమయంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహారధాన్యాల ఉత్పత్తిని కూడా పెంచాల్సిన సవాలును కూడా ఈదేశం ఎదుర్కొంటోంది. విత్తనాల దగ్గర్నుంచి మార్కెట్ వరకూ ఎన్నో మార్పులు ఇందుకోసం అవసరమైనా, మన ఆహారపు అలవాట్లు కూడా కీలకమని గుర్తించాలి. మనం అన్నిరకాల ధాన్యాలూ వాడటం అలవాటు చేసుకోవాలి. అది ఆరోగ్యప్రదాయిని కూడా. ఈ వాస్తవం తెలిసినా, ప్రచారాన్ని ఎంత హోరెత్తించినా పుట్టుక నుంచి ప్రాంతాలవారీగా వచ్చిన అలవాట్లు అంత సులువుగా మారవు. ఇది ఒక్క మనదేశంలోనే కాదు. జపాన్, చైనా, మెక్సికో దేశవాసులూ బియ్యం వాడతారు. పూర్తిగా కాకపోయినా రోజువారీ భోజనంలో ఒక భాగం రైస్ వాడకం ఉంటుంది. కొన్ని ముతకగా కొన్ని సన్నంగా, కొన్ని పొడవు గింజగా ఇలా రకరకాలు ఉంటాయి. కానీ మొత్తం మీద అన్నం ముఖ్యమైన ఆహారం వాళ్లకు కూడా. కొత్తగా తృణధాన్యాలు వాడటం కష్టమే. ఎంత ధర అయినా దొరుకుతున్నాయి గనక కొనగలిగినవారు కొంటారు. కానీ పరిమిత ఆదాయం ఉన్నవారు గోధుమ, తృణధాన్యాలను కూడా ఆహారంలో భాగం చేసుకోవటం తప్పనిసరి. ప్రభుత్వాలు, పౌరసమాజం ఈ విషయాల్ని సూటిగా

చెప్పకుండా బియ్యం వృధా చేసినా ఫర్వాలేదు, రీసైక్లింగ్‌కి అమ్మేసుకున్నా ఫర్వాలేదు అంటూ పరోక్షంగా రైతులకు, వినియోగదారులకు కూడా తీవ్ర నష్టం చేస్తోంది. సంక్షేమ హాస్టళ్లలో బలవర్ధక ఆహారంగా తృణధాన్యాలు, దంపుడు బియ్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం, తళతళలాడే సన్నబియ్యం ఇవ్వటాన్ని ఓ గొప్పలా చూపిస్తూ ప్రచారం చేసుకుంటూ పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని పెంచి పోషిస్తోంది. మీడియా కూడా ఈ వాస్తవాల్ని పదేపదే చెప్పకుండా పాలకులకు తలగ్గి వ్యవహరిస్తుండటం విచారకరం. రైస్ మానేసి శరీరాన్ని అదుపులో పెట్టుకోకపోతే ప్రమాదం అని వైద్యులు హెచ్చరిస్తే తప్ప ప్రత్యామ్నాయ ఆహారాలవైపు మొగ్గుచూపే వారి సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. ఆహారాన్ని వృధా చేయకుండా తినటం, ఆహారపు అలవాట్లు మార్చుకోవటం ఈ రెంటినీ భారీ కార్యక్రమాలుగా ప్రభుత్వాలు, పౌరసమాజం చేపట్టాలి. ఇంటింటా అమలయ్యేలా అవగాహనను పెంచాలి.

పల్లెలు పెద్ద గ్రామాలు సైతం ఖాళీ అవుతుంటే నగరాలు కిక్కిరిసిపోతున్నాయి. వారు నమ్ముకున్న నేల నుంచి వేల మైళ్లు కాక వందల మైళ్లలో ఉంటే ఫర్వాలేదు. అటూఇటూ మంచీచెడూ చూసుకోవచ్చు. ఈ తరహా మూలాల్ని కాపాడుకునే అవకాశాలకు ఊతమిచ్చేలా ప్రభుత్వాలు వ్యవహరించాలి. గ్రామాల చుట్టూ పట్టణ వాతావరణాన్ని అభివృద్ధి చేస్తే జీవనోపాధికి అవకాశాలు కల్పిస్తే వలసలు తగ్గవచ్చు. ఓ 20-30 గ్రామాలకు కలిపి ఒక చిన్న పట్టణాన్ని ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేసి చుట్టూ మౌలిక వసతుల్ని కల్పిస్తే స్థానిక ప్రజలు అద్భుతాలు సృష్టిస్తారు.

అలాగే నీటి సమస్య. వర్షాధార పంటలకు నీటిని నిల్వ ఉంచుకోవటం రైతులకు చాలా అవసరం. బావులకు రీఛార్జి చేసే సదుపాయం వచ్చింది. మెదక్ జిల్లాలోని గ్రామాలు వాన నీటి సంరక్షణతో అందరికీ ఆదర్శంగా నిలిచాయి. నీటిని వృధా చేయకుండా తక్కువ నీటితో పండే పంటల్ని ఎంపిక చేసుకుంటే, వాణిజ్యానికి లోటు ఉండదు. నీరు భూమిలోకి ఇంకే ప్రాంతాలు రీఛార్జికి అనుకూలమేకాకుండా బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరుగుతుంది. ప్రతి పొలంలో నీటి కుంటను నిర్మించుకోవడం వల్ల భూగర్భ జలాల సమస్య ఉండదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ విధానం ఫలితాలను ఇస్తోంది. కరవు జిల్లాల్లో వాటర్‌షెడ్ నిర్మించుకుని పొలాల చుట్టూ కందకాలు తవ్వి వర్షపునీటిని భద్రంగా దాచుకుంటున్న వారున్నారు. పెద్దపెద్ద వర్షాలు కాక చినుకులు పడినా ఆ తడికి నేల పంటకు అనువుగా ఉంటుంది. కొత్త ఆలోచనలతో వ్యవసాయాన్ని కాపాడుకోవచ్చు. అయితే ఈ విధానాలను రైతుల్లోకి తీసుకెళ్లి మార్కెట్ వరకూ వాళ్లకు అండగా నిలిచే పాలనా వ్యవస్థ కావాలి. భూగర్భ జలాలను నిల్వ చేయటానికి ప్రత్యేక విధానం గురించి ఐక్యరాజ్యసమితి మాజీ సలహాదారు టి. హనుమంతరావు రాతినేల ప్రాంతాల రైతులకు చక్కటి సూచనలిచ్చారు. "రాతి ప్రాంతాలలో నీరు లేకపోయినా రాతి పగుళ్లలో నీరు ఉంటుంది. వెదర్డ్ జోన్‌లో నీటి నిల్వ రాతి పొరల్లో కంటే వందరెట్లు ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ నీరు మట్టి ఉండే ప్రాంతంలోనే నీళ్లుంటాయి. అందుకే బోర్లు ఎండిపోయినా దిగుడుబావిలో జలం ఉంటుంది. బోర్లు లేకపోయినా వందశాతం బావుల్ని నమ్ముకున్న గ్రామాలు అత్యధిక లాభాల్ని పొందవచ్చు'' అని హనుమంతరావు వివరించారు. రాయలసీమ కంటే తక్కువ వర్షపాతం ఉన్న ఇజ్రాయెల్ వ్యవసాయంలో మనకు పాఠాలు చెబుతోంది. పాలకులకు సంకల్పం లేకపోవటం వల్లే విలువైన, చవకైన, తేలికైన, ఆచరణయోగ్యమైన సూచనలు కూడా వ్యవసాయంలో భాగం కాలేకపోతున్నాయి.

ఈ దేశానికి ఆహారభద్రత కావాలంటే ముందు రైతు ఆదాయ భద్రత మీద అందరూ దృష్టి పెట్టాలి. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తికి చర్యలు తీసుకోవటంతోపాటు మార్కెట్‌లో న్యాయమైన ధర లభించేందుకు అన్ని మౌలిక వసతుల్నీ కల్పించాలి. మార్కెట్ యార్డుల్ని సంస్కరించి రైతుల భాగస్వామ్యంతో నడిపించాలి. రైతులు నిరాశానిస్పృహల్లో కూరుకుపోకుండా అవసరమైతే మార్కెట్ ధరల్లో ప్రభుత్వం తోడ్పాటునందించాలి. విద్య, ఆరోగ్య రంగాలను ప్రభుత్వం నాశనం చేయటం వల్ల ప్రైవేటు రంగం పెరిగిపోతూ రైతుల మీద భారాన్ని పెంచుతోంది. అందుకే ఈ రెండు రంగాలనూ ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతగా గుర్తించి అందరికీ అందుబాటులోకి తేవాలి. రైతుల పిల్లలకు, వారి కుటుంబాలకు విద్య, ఆరోగ్యం భారం కాకుండా చేయాలి. రైతులు అవినీతి బారిన పడకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో తగిన ఏర్పాట్లు చేయాలి. అలాగే వ్యవసాయంలో కంటే ఎక్కువ ఆదాయం కోరుకుంటున్నవారు ప్రవేశించటానికి వీలుగా మిగిలిన రంగాలలో ఉపాధి అవకాశాలను పెంచాలి. అప్పుడే రైతులు తలెత్తుకుని బతకగలరు, ఆకలిమంటల్ని చల్లార్చగలరు. రైతులను, తద్వారా మనల్ని మనం కాపాడుకోవటం ప్రకృతి చేతిలో కన్నా మనందరి చేతుల్లోనే ఉంది. ⬢

# సిటిజన్ ఆఫ్ ద ఇయర్‌గా లోక్‌సత్తా నేత



లోక్‌సత్తా పార్టీ బెంగళూరు విభాగం మాజీ అధ్యక్షుడు ఎన్.ఎస్ రమాకాంత్ 'నమ్మ బెంగళూరు ఫౌండేషన్' వారి 'సిటిజన్ ఆఫ్ ద ఇయర్' పురస్కారానికి నామినేట్ అయ్యారు. గార్బేజి (చెత్త) సిటీగా మారకుండా గార్డెన్ సిటీగా బెంగళూరు కొనసాగటం వెనక రమాకాంత్ ఏళ్ల తరబడి చేసిన సేవలు ఉన్నాయి. ఆయన నిస్వార్థత, ఉత్సాహం ఇచ్చిన స్ఫూర్తితో ఎక్కడికక్కడ స్థానికంగా అనేకమంది పౌరకార్యకర్తలు తయారై నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే మిషన్‌లో భాగస్వాములయ్యారు. రమాకాంత్ కృషి వల్ల 100 అపార్ట్‌మెంట్‌లు, 20 పాఠశాలలు, 6 కాలేజీలు, అనేక కార్పొరేట్లు ఘన, ద్రవ వ్యర్థాలను వేరేచేసే కార్యక్రమం చేపట్టాయి. బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యుఎంఆర్‌టి) సహవ్యవస్థాకుడిగా పారిశుద్ధ్య పర్యవేక్షకులకు, పౌరకార్మికులకు ఆయన శిక్షణనిచ్చారు. నిత్యం జనసందోహం ఉండే ప్రార్థనా స్థలాల వద్ద వ్యర్థాలు లేకుండా చేయటంలో విజయం సాధించారు. ప్రతిష్టాత్మక టీసీఎస్ 10కె రన్‌ని జీరో-వేస్ట్ ఈవెంట్‌గా చేయగలిగారు. ఈ కృషికి గుర్తింపుగా రమాకాంత్‌కి సిటిజన్ ఆఫ్ ద ఇయర్ కేటగిరిలో నమ్మ బెంగళూరు అవార్డు నామినేషన్ లభించిందని, ఇది తామంతా సగర్వంగా చెప్పుకునే విజయమని లోక్‌సత్తా నేతలు తెలిపారు.

## ప్రజల భాగస్వామ్యం పెరిగేలా మునిసిపల్ చట్టాన్ని సవరించండి

వార్డు కమిటీల ద్వారా ప్రజలు స్థానిక పాలనలో భాగస్వాములయ్యేలా ప్రోత్సహించేందుకు కర్ణాటక మునిసిపల్ కార్పొరేషన్ చట్టాన్ని సవరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి టీకే అనిల్ కుమార్‌కు పార్టీ నేతలు విజ్ఞాపనను, ముసాయిదా నిబంధనలను సమర్పించారు. వార్డు కమిటీలకు ప్రజాస్వామిక నిర్మాణం, విధులు ఉండాలని డిమాండ్ చేశారు. వార్డు కమిటీల నిర్ణయాలపై కార్పొరేటర్ వీటో అధికారాన్ని తొలగించకపోతే ఆ కమిటీల ఏర్పాటుకు అర్థం ఉండదన్నారు. వార్డు కమిటీల సభ్యుల్ని కూడా స్థానిక ప్రజలే ఎన్నుకునేలా, ఎన్నికలకు ముందు ప్రతి అభ్యర్థీ ఐదుగురు వార్డు కమిటీ సభ్యులను ప్రతిపాదించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల శాతాన్ని బట్టి అభ్యర్థులు వార్డు కమిటీ సభ్యుల్ని నియమించవచ్చన్నారు. దాంతోపాటు, వార్డుల్లో జరిగే అన్ని పనుల వ్యయాన్నీ పర్యవేక్షించే అధికారాన్ని వార్డు కమిటీలకు ఇవ్వాలని లోక్‌సత్తా నేతలు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ-మహారాష్ట్ర మధ్య సాగునీటి ప్రాజెక్టుల ఒప్పందం

ఇరు రాష్ట్రాల సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ-మహారాష్ట్రల మధ్య ఒప్పందం కుదిరింది. రెండు రాష్ట్రాల మధ్య గతంలో కుదిరిన ప్రాజెక్టుల ఒప్పందాలు, భవిష్యత్తులో నిర్మించే ప్రాజెక్టుల పరిశీలనకు అంతర్రాష్ట్ర మండలి ఏర్పాటుపై ఒప్పందంపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖరరావు, దేవేంద్ర ఫడ్నవీస్ సంతకాలు చేశారు. గోదావరి నదీజలాల వివాద ట్రిబ్యునల్-1979 తీర్పులకు అనుగుణంగా రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టులన్నిటికీ ఈ బోర్డు పర్యవేక్షణ సంస్థగా వ్యవహరిస్తుంది. లెండి, ప్రాణహిత (తుమ్మిడిహెట్టి బ్యారేజీ), కాళేశ్వరం (మేడిగడ్డ బ్యారేజీ) ప్రాజెక్టులతోపాటు పెన్‌గంగపై రాజాపేట బ్యారేజీ, ఛనఖా-కొరటా బ్యారేజీ, పెన్‌పహాడ్ బ్యారేజీ, లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాలను బోర్డు పర్యవేక్షిస్తుంది. సందేహాలు, సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తుంది. బోర్డుకు ఒక ఏడాది ఒక్కో రాష్ట్ర ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. ప్రస్తుత ఒప్పందంతో బోర్డు పరిధిలోకి వచ్చిన ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణలో 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అంచనా. కాగా, సాగునీరు అందించటానికి ప్రత్యామ్నాయాలపై చర్చలేకుండా ఏకపక్షంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులపై ఒప్పందాలు కుదుర్చుకోవటం పట్ల పలువురు నిపుణులు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

# పురుషాధిక్య మతపెద్దల వల్లే మహిళల పట్ల వివక్ష
# హిందూ మహిళలకూ భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ మద్దతు



మహిళల పట్ల వివక్షను తాము సహించబోమని, లింగ, కుల, తెగ, మత వివక్ష లేకుండా మనుషులందరినీ సమానంగా చూడాల్సిందేనని భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ) సహవ్యవస్థాపకురాలు జకియా సోమన్ అన్నారు. ముంబయిలోని హాజీ అలీ దర్గా ప్రార్థనామందిరంలోకి ముస్లిం మహిళల ప్రవేశాన్ని నిషేధించటంపై అందుకే పోరాడుతున్నామన్నారు. శని శింగనాపూర్ దేవాలయంలోకి హిందూ మహిళల ప్రవేశానికి తమ పూర్తి మద్దతును ప్రకటిస్తున్నామన్నారు. హిందూ, ముస్లిం మహిళల పోరాటం ఒకటేనని జకియా ఒక ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ అన్నారు. మహిళల్ని మతప్రార్థనా స్థలాల్లోకి రానీయకపోవటం పురుషాధిక్య శక్తులు రూపొందించిన నిబంధనల వల్లే జరిగిందన్నారు. 1400 ఏళ్ల క్రితం మహిళలకూ ఖురాన్ సమాన హక్కులు ఇచ్చినా పితృస్వామ్య భావజాలులైన పురుష మతపెద్దలు వక్రభాష్యాలిచ్చి మహిళలకు హక్కుల్ని తిరస్కరిస్తున్నారన్నారు. అదేరీతిలో రకరకాల సాకులతో హిందూ మహిళల్ని కూడా అణగదొక్కుతున్నారన్నారు. పితృస్వామ్య భావజాలం ఉన్నవారికి మతపరమైన పెద్దరికం ఇవ్వటం వల్ల సమాజంలో మహిళలకి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నెహ్రూ, అంబేద్కర్‌లాంటి నాయకులు లింగసమానత్వం కోసం ఎంతో ఆరాటపడ్డారని, పితృస్వామ్య స్వభావంతో అన్ని మతాల్లో పెద్దలుగా ఉన్న పురుషులు మహిళలను వివక్షకు గురిచేస్తారని వారు ఆందోళన చెందారని అన్నారు. ఉమ్మడి సివిల్ కోడ్ (పౌరస్మృతి–యూసీసీ) వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని వారు భావించినా, సాధువులు, మహంతులు అడ్డుకున్నారన్నారు. దురదృష్టవశాత్తూ సాంప్రదాయ ముస్లింలలోని ఒక వర్గం కూడా ముస్లిం పర్సనల్ చట్టాన్ని సవరించకుండా అడ్డుకుంటూ వచ్చిందన్నారు. పెళ్లి, విడాకులు, బహుభార్యాత్వం, పిల్లల పెంపకం, వారసత్వం తదితర అంశాలపై ముస్లిం పర్సనల్ చట్టాన్ని సంస్కరించాలన్నారు. బీఎంఎంఏ క్రోడీకరించిన ముస్లిం కుటుంబ చట్టానికి న్యాయవాదులు, ముస్లిం మహిళల నుంచి మద్దతు లభిస్తున్నా, ముస్లిం సంస్థలు స్పందించటం లేదన్నారు. ఈ చట్టం ముసాయిదాకు లా కమిషన్, జాతీయ న్యాయసేవల సంస్థ కూడా మద్దతిచ్చిందన్నారు. ఖురాన్ పరిధిలోనే అయినా, 1947 తర్వాత మొదటసారిగా, పెళ్లి, విడాకులు వంటి కీలకాంశాలలో ముస్లిం మహిళల హక్కుల్ని పరిరక్షించేలా ఈ చట్టాన్ని రూపొందించామని జకియా సోమన్ అన్నారు.

# 'మహా' మహిళల ధైర్యం

న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కి, న్యాయస్థానాలకు వెళ్లటానికి ధైర్యం చూపటంలో ముందున్నామని మహారాష్ట్ర మహిళలు చాటుతున్నారు. జాతీయ న్యాయ సమాచార నిధి (ఎన్‌జేడీజీ) సంస్థ తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. కింది స్థాయి న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల లెక్కను ఈ సంస్థ వెల్లడించింది. సుప్రీంకోర్టుకి చెందిన ఈ-కమిటీ ఆధ్వర్యంలో ఇది నడుస్తుంది. ఫిబ్రవరి 12 దాకా ఉన్న లెక్కప్రకారం, మనదేశంలోని కిందిస్థాయి కోర్టులలో రెండు కోట్ల కేసులున్నాయని ఎన్‌జేడీజీ తెలిపింది. వీటిలో 13శాతం (28,71,157) కేసులు మహిళలవే. వీటిలో 13,09,137 కేసులు సివిల్ కాగా, 15,62,020 క్రిమినల్ కేసులు. 39.94శాతం (11,46,730) కేసులతో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. 14.78 కేసులతో ఉత్తర ప్రదేశ్, 5.55 శాతం కేసులతో పశ్చిమ బెంగాల్, 4.74శాతంతో తమిళనాడు, 4.16శాతం కేసులతో రాజస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# మహిళల ప్రాతినిధ్యానికి ప్రత్యామ్నాయ మార్గాలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

చట్టసభలలో మహిళలకు మూడోవంతు ప్రాతినిధ్యం కల్పించాలని చాలామంది కోరుకుంటున్నా, ప్రస్తుతం ప్రవేశపెడుతున్న ప్రతిపాదనల వల్ల ఎన్నో ఇబ్బందులున్నాయి. ఒక నియోజకవర్గాన్ని శాశ్వతంగానో, తాత్కాలికంగానో మహిళలకే కేటాయిస్తే నాయకత్వం సహజంగా ఎదిగే అవకాశం ఉండదు. ప్రస్తుతం పార్టీలలో పలుకుబడి ఉన్న పెద్దలే తమ భార్యలనో, కుమార్తెలనో, ఇతర సమీప బంధువులనో అభ్యర్థులుగా నియమించాలని ప్రయత్నిస్తారు. గెలిచే అవకాశమున్న ప్రధాన పార్టీలు ఆ విధంగా చేయటంతో పౌరులకు సరైన అభ్యర్థులు లభించరు. చివరికి ఎవరు గెలిచినా అందులో మహిళలకు ఒరిగేదేమీ ఉండదు. మహిళలతో సహా అన్ని రిజర్వేషన్లు కలిపి దాదాపు 50శాతానికి చేరటంతో రొటేషన్ పద్ధతిని అమలు చేయాల్సి ఉంటుంది. దాంతో ఒకసారి పోటీచేసిన, లేదా గెలిచిన ఏ అభ్యర్థీ తరువాత ఎన్నికలో పోటీ చేసే అవకాశం ఉండదు. దాంతో గెలిచినవాళ్లు మరీ పేట్రేగిపోయి, ప్రజల పట్ల ఏమాత్రమూ భయం, గౌరవం లేకుండా జాతి ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రమాదముంది. మంచివాళ్లు ఎన్నికయినా, మళ్లీ పోటీచేసే అవకాశం లేక నీరసించిపోతారు. ఎవరూ వరసగా రెండోసారి సభ్యులయ్యే అవకాశం లేకపోవటంతో చట్టసభలు, ప్రభుత్వాలు అంతా కొత్తవాళ్లతో, పాలన అనుభవం లేనివాళ్లతో నిండిపోతాయి. ప్రభుత్వ నిర్వహణ మరింత గందరగోళం అవుతుంది. రాజకీయ నాయకత్వం ఎప్పటికప్పుడు కృత్రిమంగా, అసహజంగా, లాటరీలాగా తయారవుతుంది. ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించటం కోసం మరింత సమంజసమైన సమర్థమైన ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి. అలాంటి మూడు ప్రత్యామ్నాయాలను పరిశీలించటం ఈ వ్యాసం ఉద్దేశం.

**బహుళ సభ్య నియోజకవర్గాలు**

మొదటి ప్రత్యామ్నాయం బహుళ సభ్య నియోజకవర్గాలు. ఉదాహరణకు మన రాష్ట్రాన్నే తీసుకుంటే, ఇక్కడి 42 పార్లమెంటు నియోజకవర్గాలను 14 బహుళ సభ్య నియోజకవర్గాలుగా మార్చవచ్చు. అలాంటి ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ముగ్గురు ఎన్నికవుతారు. వారిలో ఒక స్థానం విధిగా మహిళలకు కేటాయించవచ్చు, అవసరాన్ని బట్టి కొన్ని నియోజకవర్గాలలో మరో స్థానం దళితులకు, గిరిజనులకు కేటాయించవచ్చు. మిగిలిన ఒకటి, లేదా రెండు స్థానాల కోసం మిగిలినవారు పోటీ పడవచ్చు. ప్రతి ఓటరుకు ముగ్గురు అభ్యర్థులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. కేటాయింపులను బట్టి, ఏ అభ్యర్థులకు ఎక్కువ ఓట్లు వస్తే ఆమె మహిళా సభ్యురాలుగా ఎన్నికవుతారు. గిరిజనులు, దళితులకు ఒక



స్థానం కేటాయిస్తే, ఆ వర్గాల అభ్యర్థులలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారు సభ్యులవుతారు. గిరిజన, దళితుల స్థానాలలోనూ మూడోవంతు మహిళలకు కేటాయిస్తారు. మిగిలినవారిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే, వారిలో ఒకరు, లేదా ఇద్దరు రిజర్వేషన్ లేని స్థానాల నుంచి ఎన్నికవుతారు. ఇందువల్ల ప్రతి పౌరునికి మహిళా సభ్యులను రొటేషన్ పద్ధతిపైన దళిత, గిరిజన సభ్యులను ఎన్నుకునే అవకాశం లభిస్తుంది. ఓటర్లు తమ ఇష్టాయిష్టాలను బట్టి, అభ్యర్థుల గుణగణాలను బట్టి ఒక్కో వర్గంలో ఒక్కో పార్టీకి చెందినవారికి ఓటు వేయవచ్చు. అలాగే అన్ని వర్గాల వారికి ప్రతి నియోజకవర్గంలో పోటీచేసే అవకాశం ఉంటుంది. ఆ విధంగా ఎన్నికలలో అభ్యర్థుల గుణశీలాలకు విలువ పెరుగుతుంది. ఇదేదో చాలా గందరగోళంగా, క్లిష్టంగా ఉంటుందని భయపడనక్కర్లేదు. 1952, 1957 సంవత్సరాలలోనే మొదటి రెండు సాధారణ ఎన్నికలలో దళిత, గిరిజన స్థానాల రిజర్వేషన్లను ఈ విధంగా అమలు చేశారు. ఆనాటితో పోలిస్తే గత 45 సంవత్సరాలలో ప్రజలలో అక్షరాస్యత, రాజకీయ

అవగాహన పెరిగాయి. అప్పుడే సాధ్యమయిన బహుళ సభ్యత్వ నియోజకవర్గాలు ఇప్పుడు అమలు చేయటం మరింత సులువు. బహుళ సభ్య నియోజకవర్గాల వల్ల రెండు సమస్యలున్న మాట నిజం. మొదటిది, నియోజకవర్గాల పరిధి పెరిగి ఎన్నిక నిర్వహణ కొంత కష్టమవుతుంది. ఎన్నికయిన సభ్యులకు, ప్రజలకు ఎడం పెరిగే అవకాశముంది. ప్రజలకు ఒకరికి బదులు ముగ్గురు ప్రతినిధులు వ్యవహరించినా, కొంత ఇబ్బంది ఉండవచ్చు. రెండవది, ఈ పద్ధతి చాలామంది ఓటర్లకు, అందునా అక్షరజ్ఞానం లేనివారికి కొంత తికమకగా అనిపించవచ్చు. ఇబ్బందులు కొంతమేరకు ఉన్నప్పటికీ, మహిళల కోసం, దళిత, గిరిజన సభ్యుల కోసం కొన్ని నియోజకవర్గాలను కేటాయించటం కంటే ఈ బహుళ సభ్యత్వ నియోజకవర్గాలు ఎంతో ఉత్తమం. ఇందులో నాయకత్వం మరింత సహజంగా, సాఫీగా అభివృద్ధి చెందుతుంది. ఓటర్లకు అభ్యర్థులను ఎంచుకునే అవకాశం పెరుగుతుంది. అన్ని సీట్లు ఒకే పార్టీకి కాక, నిలబడ్డ అభ్యర్థులను బట్టి వివిధ పార్టీల వారికి ఒకే ఓటరు ఓటు వేసే అవకాశం కలుగుతుంది. బండగా పార్టీల అగ్రనాయకులకో, పార్టీల గుర్తులకో ఓటు వేయటం కాక, కాస్త ఆలోచించి అభ్యర్థుల్ని ఎంచుకునే సంప్రదాయం బలపడుతుంది.

**దామాషా పద్ధతి ఎన్నిక**

మహిళలకు, దళితులు, గిరిజనులకు తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి దామాషా పద్ధతి ఎన్నిక మరో మార్గం. ఉదాహరణకు మన రాష్ట్రంలో ఉన్న 42 పార్లమెంటు స్థానాలలో 21 లేదా 22 స్థానాలను నియోజకవర్గాలలో ఎన్నిక ద్వారా ఇప్పటి మాదిరిగానే భర్తీ చేయవచ్చు. ఇందులో నియోజకవర్గాల సంఖ్య తగ్గి, పరిధి పెరుగుతుంది. మిగిలిన 20 లేదా 21 స్థానాలను నిర్దేశించిన శాతం మేరకు 14 మహిళలకు, మిగిలినవి దళితులకు, గిరిజనులకు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రం మొత్తంలో ఆయా పార్టీలకు వచ్చిన మొత్తం ఓట్ల శాతాన్ని పరిగణలోకి తీసుకుని ఈ సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు నాలుగు ప్రధాన పార్టీలకు 40, 40, 15, 5శాతం చొప్పున ఓట్లు వచ్చాయనుకుందాం. 5శాతం లోపల ఓట్లు వచ్చిన పార్టీలకు దామాషా ప్రాతినిధ్యం ఉండదు. మిగిలిన పార్టీలకు 8, 8, 3, 1 స్థానాలు వరసగా లభిస్తాయి. 22 స్థానాలు ఇప్పటిలాగే నియోజకవర్గం వారీ ఎన్నికల ద్వారా భర్తీ అవుతాయి. దామాషా పద్ధతిలో సీట్లు భర్తీ కావాలంటే, ఆయా పార్టీలు తాము నిలబెట్టే 20 లేదా 21 మంది అభ్యర్థుల జాబితాను ముందుగానే విధిగా ప్రకటించాలి. ఆ అభ్యర్థుల సంఖ్య రిజర్వేషన్ల ద్వారా ఆయా వర్గాలకు కేటాయించిన విధంగా ఉండాలి. దళితులూ, గిరిజనులలో కూడా మహిళల ప్రాతినిధ్యం ఉండి, మొత్తం అన్నివర్గాల మహిళల సంఖ్య కనీసం మూడోవంతు ఉండాలి. ఒక పార్టీ ప్రకటించిన జాబితాలో అభ్యర్థికి ఇచ్చిన వరస క్రమాన్ని బట్టి అభ్యర్థులు ఎంపికవుతారు. ఉదాహరణకు ఆ పార్టీకి రాష్ట్రంలో 8 స్థానాలు దామాషా పద్ధతిన వస్తే, 5 లేక 6 స్థానాలలో మహిళలు (దళితులు, గిరిజనులతో కలిపి), మిగిలిన 2 లేదా 3 స్థానాలలో దళితులూ గిరిజనులలోని పురుషులు జాబితాలో వరస క్రమాన్ని బట్టి గెలుపొందినట్లుగా ప్రకటిస్తారు. ఈ పద్ధతి వల్ల ఓటర్లకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటి మాదిరిగానే నియోజకవర్గాలలో అభ్యర్థులకు ఓటు వేస్తారు. అయితే పార్టీ అభ్యర్థులకు వేసే ఓట్లు ఆ పార్టీ తరపున దామాషా పద్ధతిన ఎన్నిక కోసం ఉపయోగపడతాయి. పార్టీల జాబితాలలో ఏ పార్టీకి ఎందరు, ఏ వర్గాల వారు ఎన్నికవ్వాలో కొంత క్లిష్టమైన అంశమైనప్పటికీ, దానితో ఓటర్లకు సంబంధం లేదు. శిక్షణ పొందిన ఎన్నికల అధికారులు ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో అన్ని పార్టీలకు, ప్రజలకు అర్థమయ్యేరీతిలో ఆ లెక్కలు వేసి జాబితాలలోని అభ్యర్థుల ఎంపికను ప్రకటిస్తారు. పార్టీలు రాష్ట్రాలలో లేదా జిల్లాలలో ఉన్న నాయకులలో మంచి పేరు, శక్తిసామర్థ్యాలు ఉన్నవారిని తమ తమ పార్టీ జాబితాలలో ఆయా వర్గాల తరపున అభ్యర్థులుగా ప్రకటించవచ్చు కాబట్టి నాయకత్వం సహజంగా, సాఫీగా ఎదుగుతుంది. దామాషా పద్ధతి వల్ల కూడా కొన్ని సమస్యలున్నాయి. మొదటిది– ఓటర్లకు అభ్యర్థుల్ని ఎంపిక చేసే అవకాశం తగ్గుతుంది. విధిగా తమకు నచ్చిన పార్టీ అభ్యర్థికే ఓటు వేయాల్సి ఉంటుంది. లేకపోతే ఇటు నియోజకవర్గంలోను, అటు దామాషాలోను ఆ పార్టీ నష్టపోతుంది. పార్టీ కూడా నియోజకవర్గాల్లో వీలున్నంతమేరకు ఓట్లు పొందటం కోసమని మంచిపేరున్న అభ్యర్థులనే ప్రతిపాదించే అవకాశముంది. లేకపోతే రెండుచోట్లా నష్టపోతామనే భయం పార్టీలను వేధిస్తుంది. దామాషా పద్ధతి వల్ల ఉత్పన్నమయ్యే రెండవ సమస్య మరింత తీవ్రమైంది. ఇప్పటికే దేశంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయి. పార్టీ అధినాయకులు తమ ఇష్టాయిష్టాలను బట్టి వారి అడుగులకు మడుగులు వత్తే వారిని అభ్యర్థులుగా నిలబెడుతున్నారు. పార్టీ సభ్యులు అదేమంటే, కన్యాశుల్కంలో అగ్నిహోత్రావధాన్లు లాగా

'తాంబూలాలిచ్చేశాను, తన్నుకు చావండీ' అని లెక్కలేకుండా మాట్లాడుతున్నారు. ప్రధాన పార్టీలన్నీ అలాగే వాజమ్మలను, గూండాలను, నేరస్తులను, డబ్బు తప్ప మరే అర్హత లేనివాళ్లను, అవినీతిపరుల్ని ఎక్కువమందిని అభ్యర్థులుగా నిలబెడుతున్నాయి. దాంతో ఓటర్లకు 'దొందూ దొందే'గా కనిపించి, 'ఏ రాయైతేనేమి? పళ్లూడగొట్టుకోవటానికి!' అని అనాసక్తంగా ఓటు వేయాల్సి వస్తోంది. లేదా గూండాలకు భయపడో, డబ్బుకు లంగో, క్షణికావేశాలకు లోనయ్యో ఓటు వేస్తున్నారు. అలాంటప్పుడు, జాబితాలు తయారుచేసే అధికారం ఆ పార్టీల నాయకులకిస్తే వారి ధోరణి మరింత నిరంకుశమై పార్టీ సభ్యులు ఇంకా బలహీనమయ్యే ప్రమాదముంది. అలాగే ఓటర్ల పాత్ర మరింత క్షీణించి, ఇంకా నామమాత్రమవుతుంది. కాబట్టి పార్టీ జాబితాలను ప్రజాస్వామికంగా, నిర్దేశించిన పద్ధతి ద్వారా, పార్టీ లోపల ఓటింగు ద్వారా తయారుచేసేటట్లు చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి. ఈ ఇబ్బందులను అధిగమించాలంటే పార్టీలను ప్రజాస్వామీకరణం చేసి, వాటిని నేతల నియంతృత్వం నుంచి తప్పించి సభ్యుల అధీనంలోకి తేవాలి. ఇది దామాషా పద్ధతిలో కొత్తగా ఉత్పన్నమయిన సమస్య కాదు. పార్టీలు నాయకుల సొంత ఆస్తులుగా చలామణి కావటం ప్రస్తుతం చాలాచోట్ల నడుస్తున్నది! ఈ సమస్యలున్నప్పటికీ, దామాషా పద్ధతిన వివిధ వర్గాలకు సీట్లు కేటాయించటం, ప్రస్తుతం ప్రవేశపెట్టిన నియోజకవర్గాల రిజర్వేషన్ కంటే చాలా ఉత్తమమయినది.

**పార్టీల జాబితాల్లోనే కేటాయింపులు**

వివిధ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభించి శాశ్వత ప్రాతిపదికన సహజ నాయకత్వం ఎదగాలంటే పార్టీ అభ్యర్థుల ఎంపికలోనే చట్టబద్ధంగా కొన్ని మార్పులు చేయటం సర్వశ్రేష్టమయిన పద్ధతి. ఇందులో పార్లమెంటు సీట్లకు రాష్ట్రం, శాసనసభ సీట్లకు జిల్లా యూనిట్లుగా ఉంటాయి. ఆ యూనిట్లలోని స్థానాలలో మహిళలకు, దళితులకు, గిరిజనులకూ విధిగా తగిన సంఖ్యలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలి. ఉదాహరణకు మన రాష్ట్రంలోని ఒక పార్టీ 42 స్థానాలలో అభ్యర్థుల్ని నిలబెడితే, 14 స్థానాలకు విధిగా మహిళలనే (దళిత, గిరిజన మహిళలతో సహా) ఎంపిక చెయ్యాలి. చట్టాన్ని బట్టి, మరొక 5 నుంచి 6 స్థానాలలో దళిత, గిరిజన పురుష అభ్యర్థుల్ని ఎంపిక చేయాలి. అయితే ఏయే స్థానాలలో మహిళల్ని, ఇతరుల్ని నిలబెట్టాలనేది ఆ పార్టీకే వదిలేయాల్సి ఉంటుంది. అంటే ఆ పార్టీకి ఆ నియోజకవర్గంలో ఉన్న నాయకత్వాన్ని బట్టి, అందుబాటులో ఉన్న అభ్యర్థుల శక్తిసామర్థ్యాలు, గుణగణాలు, పలుకుబడిని బట్టి అభ్యర్థులను నియమించవచ్చు. ఫలానా నియోజకవర్గంలోనే మహిళా అభ్యర్థిని నిలబెట్టాలని నియమం లేదు. మొత్తం మీద మూడోవంతు మంది ఆ రాష్ట్రంలో ఆ పార్టీ తరపున మహిళా అభ్యర్థులు ఉండితీరాలి. పార్లమెంటు ఎన్నికకు రాష్ట్రాన్ని యూనిట్‌గా పరిగణించటం అవసరం. లేకపోతే ఒక పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాలలో మగవాళ్లను, అగ్రకులాల వాళ్లను నిలబెట్టి, ఎలాగూ విజయావకాశాలు లేని రాష్ట్రాలలో సీట్లను మహిళలకు, దళితులకు, గిరిజనులకు కేటాయించే అవకాశం ఉంది. రాష్ట్రాన్ని యూనిట్‌గా నిర్ధారిస్తే, ప్రతి రాష్ట్రంలోను, పోటీకి పెట్టిన ప్రతి పార్టీ విధిగా నిర్దేశించిన సంఖ్యలో మహిళలను, దళితులను, గిరిజనులను అభ్యర్థులుగా నిర్ణయించాల్సి ఉంటుంది. రాష్ట్ర అసెంబ్లీకి జిల్లాను ప్రాతిపదికగా తీసుకుంటే, ఆ జిల్లాలోని స్థానాలలో విధిగా నిర్దేశించిన శాతం మేరకు ఆ పార్టీ వివిధ వర్గాలవారిని నిలబెట్టాల్సి ఉంటుంది. ఈ పద్ధతి వల్ల ప్రతి పార్టీ ఒకే నియోజకవర్గంలో ఒకే రకం అభ్యర్థుల్ని నిలబెట్టాల్సిన అవసరం లేదు. తమ అభ్యర్థుల గుణగణాల్ని బట్టి ఎవరు ప్రజాభిమానాన్ని పొందే అవకాశం ఉందో వారిని నిలబెట్టవచ్చు. కేటాయించిన వర్గాల వారికి తగిన సంఖ్యలో సీట్లివ్వటం మాత్రం తప్పనిసరి. అలా నిలబడ్డవారు సమర్థులు కాకపోతే పార్టీ నష్టపోతుంది కాబట్టి, ఆ వర్గాలలో నాయకత్వ లక్షణాలున్నవారిని ఎంపిక చేస్తారు. తమ చెప్పుచేతల్లో ఉండేవారిని ఎంపిక చేసే ఇప్పటి అలవాటు తగ్గుముఖం పడుతుంది. దేశమంతటా ఎన్నో నియోజకవర్గాలలో ప్రధాన పార్టీల తరపున బలమైన అభ్యర్థులు మహిళలు, దళితులు, గిరిజనుల నుంచి నిలబడతారు. అప్పుడు ప్రజల అభీష్టం మేరకు ఆయా వర్గాల వారు ఎంత శాతమైనా ఎన్నిక కావచ్చు. ఉదాహరణకు స్త్రీలు తలుచుకుంటే సగం మంది, లేదా ఇంకా ఎక్కువ మహిళా సభ్యులే ఎన్నిక కావచ్చు. ఒకవేళ పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువగా ఎన్నికయినా, కనీసం 20-25శాతం దాకా వెంటనే ఎన్నికవుతారు. అది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లో కాక, తమ శక్తిసామర్థ్యాల వల్ల, ప్రజలను ఆకట్టుకోవటం వల్ల ఎన్నికవుతారు. సహజమైన నాయకత్వం పెరిగి, జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను విశిష్టస్థానాన్ని పొందుతుంది. ప్రస్తుతం ఒకటి రెండు ఉదాహరణల్ని మినహాయిస్తే రిజర్వుడు స్థానాలలో ఎంపికయినవారికి నిజమైన గుర్తింపు, గౌరవం, ప్రతిష్ట లేవు.

వారు పెద్ద నాయకులుగా ఎదగటం దాదాపు అసాధ్యమయిపోయింది. ఈ విధంగా ఏ కోణం నుంచి చూసినా పార్టీలు రాష్ట్రాలలో, జిల్లాలలో విధిగా ఆయా వర్గాల వారిని తగినంతమందిని తమకు అవకాశమున్న నియోజకవర్గాలలో అభ్యర్థులుగా నియమించటం అన్నివిధాలా అవసరం. పార్టీలు తప్పనిసరిగా ఆ విధంగా అభ్యర్థుల్ని ఎంపిక చేసే విధంగా రాజ్యాంగంలో సవరణలు చేయాలి. తగిన చట్టం చేయాలి. దాన్ని పాటించకపోతే ఆ పార్టీకి గుర్తింపు రద్దవుతుంది. పార్టీలకతీతంగా పోటీచేసేవారి ప్రభావం ఎన్నికల మీద చాలా స్వల్పంగా మాత్రమే ఉంటుంది.

**ప్రజాస్వామిక పరిష్కారాలు**

ఏ పద్ధతిని అనుసరించినా, పార్టీలలో నాయకత్వం ఎన్నికల, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రాథమిక ఎన్నికల ద్వారా, సభ్యుల అభీష్టానుసారం జరిగే విధంగా చట్టాలను తయారుచేయాలి. లేకపోతే పార్టీలలో నియంతృత్వం, ఆశ్రిత పక్షపాతం ఇలాగే కొనసాగి, ఎవరు ఎన్నికయినా ప్రజలే నిరంతరం ఓడిపోయి ఆక్రోశించటం ఖాయం. మహిళల ప్రాతినిధ్య సమస్యను ఒక సువర్ణావకాశంగా భావించి, రాజకీయ పార్టీలను చట్టబద్ధంగా ప్రక్షాళన చేసి, అవి ప్రజాస్వామ్యబద్ధంగా నడిచేలా శాసనపరంగా ఏర్పాట్లు చేయటం, ఆ చట్టాన్ని పర్యవేక్షించే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వటం అత్యవసరం. అలాకాక గతంలోలాగే కంటితుడుపు చర్యల్ని చేపట్టి తాత్కాలికంగా కొన్ని వర్గాలను మోసంతో సంతృప్తిపరిచే ప్రయత్నం చేస్తే, పేరుకు ఎందరు మహిళలు ఎన్నికయినా ఫలితం మాత్రం శూన్యం. మన సమస్యలకు హేతుబద్ధమయిన, ప్రజారంజకమయిన, ప్రజాస్వామికమయిన చక్కటి పరిష్కారాలు ఉన్నాయి. వాటిని అమలుచేసే చిత్తశుద్ధి నాయకులకు, వీటిని చర్చించి ప్రజలను సమాయత్తం చేసే విజ్ఞత ఆలోచనాపరులకు ఉన్నాయా అన్నదే కీలకమైన ప్రశ్న.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఆగస్టు 3, 1998న ఈనాడులో ప్రచురితమైన ఈ వ్యాసం అంతర్జాతీయ మహిళా దినోత్సవ మాసం సందర్భంగా)

## 4 నుంచి తమిళనాడు, కేరళ, అసోం, బెంగాల్, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు

తమిళనాడు, కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఏప్రిల్ 4 నుంచి మే 16వరకు పలు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో మే 16న ఒకే దశలో పోలింగ్ నిర్వహిస్తారు. అసోంలో ఏప్రిల్ 4, 11న రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. వామపక్ష తీవ్రవాద ప్రభావిత పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 4, 11 (ఒకటో దశ), 17, 21, 25, 30, మే 5 తేదీల్లో ఆరు దశల్లో పోలింగ్ జరగనుంది. అసోంలో 126, కేరళలో 140, తమిళనాడులో 234, పశ్చిమ బెంగాల్‌లో 294, పశ్చిమ బెంగాల్‌లో 30 స్థానాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో తొలిసారి 'నోటా'కు గుర్తును కేటాయించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ రూపొందించిన ఈ గుర్తును అభ్యర్థుల జాబితా కింది భాగంలో ఉంచుతారు. జీపీఎస్ ఉపకరణాలు అమర్చిన వాహనాలతో ఫిర్యాదులు పరిష్కరించే బృందాలు ఏర్పాటు చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ నసీం జైదీ తెలిపారు. బంగ్లాదేశ్‌తో ప్రాదేశిక ప్రాంతాల మార్పిడితో భారత పౌరులైన 16వేలమందికి ఈ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. మొత్తం 824 అసెంబ్లీ నియోజకవర్గాలలో 17 కోట్లమంది ఓటర్లు ఓటేయనున్నారు. అసోంలో 1.98కోట్లు, కేరళలో 2.56కోట్లు, తమిళనాడులో 5.80కోట్లు, పశ్చిమ బెంగాల్‌లో 6.55కోట్లు, పుదుచ్చేరిలో 9.27 లక్షలు ఓటర్లున్నారు. ఈవీఎంలలో అభ్యర్థుల చిత్రాలను ఏర్పాటు చేస్తారు. మే 19న ఫలితాలను ప్రకటిస్తారు.

## త్వరలో ప్రశాంత్ కిషోర్ 'ది ఎలక్షన్ గేమ్'

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ భారీ విజయాలకు ఎన్నికల ఎత్తుగడలను అందించిన ప్రశాంత్ కిషోర్ తన వ్యూహాలను పుస్తక రూపంలో అందించనున్నారు. భారతీయ ఓటర్లపై ఉన్న ప్రభావం, నేతల నుంచి ప్రజలు ఏం కోరుకుంటున్నారు, వారి డిమాండ్లు ఏమిటి వగైరా విషయాలను ఈ పుస్తకంలో చెబుతారు. ప్రముఖ పాత్రికేయుడు శంకర్షన్ ఠాకూర్ సహ రచయితగా వ్యవహరిస్తారు. 'ది ఎలక్షన్ గేమ్' అనే ఈ పుస్తకం ఈ ఏడాది చివర్లో మార్కెట్‌లోకి రానుంది.


# పుట్టుకతో వృద్ధులకు కన్నయ్య సవాల్



ఫిబ్రవరి 9 రాత్రి నుంచి కేవలం 20 రోజులు గడిచేలోగా ఢిల్లీ జేఎన్‌యూ నుంచి కన్నయ్య కుమార్ అనే ఓ విద్యార్థి దేశవ్యాప్తంగా నాయకత్వ స్థాయికి ఎదిగాడు. దాని వెనక నరేంద్ర మోదీ ప్రభుత్వంతో ఢీకొట్టటం, సోషలిస్టు భావజాలుర యాజమాన్యంలోని మీడియా విపరీత ప్రచారం వంటి కారణాలున్నా ఈదేశ యువత మొత్తం నేర్చుకోవాల్సిన కొన్ని ముఖ్యాంశాలు కూడా ఉన్నాయి. వివాదాస్పద దేశవ్యతిరేక ప్రచార నేరారోపణతో అరెస్టయిన కన్నయ్య బైటికొచ్చిన అనంతరం చేసిన ప్రసంగం పలువురిని ఆకట్టుకుంది. జాతీయ జెండాలు ఎగరవేసే స్థాయి మొక్కుబడి ఆజాదీని జన జీవితాల్ని మార్చే నిజమైన ఆజాదీగా మార్చాలన్న తన లక్ష్యానికి ఒక స్పష్టమైన నిర్వచనం ఇచ్చాడతను. ఆ తర్వాత వివిధ టీవీ ఛానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో కూడా తన ఊరు, బంధువులు, నరేంద్ర మోదీ ప్రభుత్వం, సమాజం, దేశం గురించి సవివరంగా విశ్లేషించాడు. ఒక సామాన్య కుటుంబంలో నుంచి వచ్చిన కన్నయ్య కేవలం చదువు వల్లే ఈ స్థాయిని అందుకోగలిగాడు. ఆ మాటను అతనే స్వయంగా చెప్పాడు. ప్రపంచ దేశాలన్నిటిలో సోషలిస్టులు ప్రజలకు మంచి విద్య, ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా అందించేందుకు కృషి చేసి దేశాభ్యుదయానికి విశేష కృషి చేయగా, మనదేశంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించిన ఆ శక్తులకే కన్నయ్య ప్రతినిధిగా ఉండటం అతని పరిమితుల్ని తెలియచేస్తుందనటంలో సందేహం లేదు. కన్నయ్య భావాలు పరిమిత చట్రంలోనివే అయినా, జనజీవితాల్ని సమూలంగా మార్చగలిగే రాజకీయ రంగానికి ఈదేశంలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న యువత దూరమవుతున్న ప్రస్తుత నేపథ్యంలో కన్నయ్య సందేశం చాలా బలీయమైనది. అధికారమే లక్ష్యంగా అవినీతి డబ్బును పంచుతూ పార్టీలు గెలుస్తున్నా, యువనేతల పేరుతో వంశపారంపర్య రాజకీయాలను ప్రోత్సహిస్తున్నా కళ్లప్పగించి చూడటం, మాకెందుకులే అని కెరీర్‌లు, వస్తుసుఖాల వేటలో మునిగితేలుతున్న యువతకు కన్నయ్య ఓ కుదుపు. కన్నయ్య ప్రసంగం కొన్నిచోట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ ప్రసంగాన్ని తలపించిందని కొంతమంది వ్యాఖ్యానించారు. నిజమే, నాగరికులను మార్చటానికి ఒక మంచి ప్రసంగం చాలు. కన్నయ్యది తరతరాలనూ ప్రభావితం చేసే వ్యవస్థీకృత మార్పులను తెచ్చే ప్రసంగం కాకపోయినా, శ్రీశ్రీ కాలంకంటే ఎన్నోరెట్లు ఎక్కువ సంఖ్యలో పుట్టుకతో వృద్ధుల్లా తయారైన ఈనాటి యువతరానికి అతనో మేలుకొలుపు. యువత స్వతంత్ర పోరాటంలోలా తమ జీవితాల్ని త్యాగం చేసి రాజకీయాల కోసం పని చేయటం ఇప్పుడు ఆచరణ సాధ్యమైన నమూనా కూడా కాదు. అప్పట్లోలా ఇప్పుడు వ్యవసాయం మీదే ఆధారపడిన నత్తనడక ఆర్థిక వ్యవస్థ లేదు. పోటాపోటీ ప్రపంచంలో నెగ్గాలంటే కెరీర్‌కకోసం సమయాన్ని, శక్తియుక్తుల్ని కేంద్రీకరించాల్సిందే. అలాగే దేశం కోసం అందరూ గొప్ప త్యాగాల్ని చేయాలి ఆశించటం సమంజసం కాదు, అది ఆచరణీయం కూడా కాదు. అందుకే ప్రతి యువతి, యువకుడు తన వ్యక్తిగత జీవితాన్ని చూసుకుంటూనే తన చుట్టుపక్కల సమస్యల మీద పనిచేస్తూ, ఒక అవగాహనతో పరిష్కారాలను చూపుతూ థాట్‌లీడర్‌గా ఎదగాలి. యువత తమ చదువుకు, కెరీర్‌కు, కనీస సుఖాలకు యువత వెచ్చిస్తున్న సమయాన్ని, శక్తిసామర్థ్యాలను లెక్కేస్తే.. ఇంకా చాలా మిగులు ఉంటుందనటంలో సందేహం లేదు. సోమరితనాన్ని వదిలేస్తే యువతీయువకులు త్యాగాలు అక్కర్లేకుండానే తమ చుట్టుపక్కల చాలా చేయొచ్చు. వారిలో బాగా సామర్థ్యం ఉన్నవారు రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా పనిచేయొచ్చు. అందుకే కన్నయ్యకు ఎన్ని పరిమితులున్నా.. పుట్టుకతో వృద్ధుల్లా వ్యక్తిగతానికే పరిమితమైన ఈదేశ యువతకు బలమైన సవాలు విసిరాడని చెప్పకతప్పదు. యువత తలుచుకుంటే మునుపెన్నడూ లేని సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈకాలంలో ఎంతో ప్రభావం చూపించవచ్చని రుజువు చేసిన కన్నయ్య సవాలును యువతరం స్వీకరించాలి, థాట్‌లీడర్స్‌గా ఎదగాలి, పాత రాజకీయాన్ని ప్రక్షాళన చేసి జనం చుట్టూ తిరిగే కొత్త రాజకీయాన్ని నిర్మించాలి.

# ఏపీ రాజధాని భూదందాపై భారీ ఆరోపణలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆపరేషన్ ఆకర్ష్‌తో వైకాపా ప్రజాప్రతినిధులను లాగుతుంటే, బ్రేక్ వేయటానికి వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డికి తక్షణం ఓ సంచలనాస్త్రం కావాల్సి వచ్చింది. దాంతో రాజధాని అమరావతి భూదురాక్రమణ పర్వాన్ని తన సొంత పత్రిక ద్వారా వదిలారు. చంద్రబాబు ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆయన కుమారుడు లోకేష్ వంటి రాజ్యాంగేతర శక్తులు ఎలా రాజధాని నిర్మాణం పేరుతో భూముల్ని 'చట్టానికి దొరక్కుండా' కొల్లగొడుతున్నారో వివరిస్తూ ఆ పత్రిక సీరియల్‌లా కథనాలు ప్రచురించింది. రాజధాని పేరుతో అంతా కేంద్రీకరించి భారీ దోపిడీ చేస్తున్నారని తెలుసుగానీ ఇంత పచ్చిగా రావటంతో తెదేపా నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు మైండ్ బ్లాంక్ అయింది. కాస్త మసాలా అద్దినా, రాజధాని చుట్టూ భూముల కొనుగోలు, అసైన్డ్ భూములు లాక్కోవటం తెదేపా అధికార దుర్వినియోగంపై ప్రాథమిక ఆధారాలున్న ఆరోపణలివి. నెలవారీ సగటు జీతగాళ్లు, రోజువారీ పౌష్టికాహారానికి ఠికాణా లేని వారు కోట్ల రూపాయల భూములు కొన్నారంటే, బినామీలు కాక మరేమవుతారని అడుగుతున్న ప్రశ్నలకు సరైన జవాబులు లేవు. పోలవరం ప్రాజెక్టులో తెదేపా ఎంపీగా ఉన్న ఓ నాయకుడికి రూ. 4,000 కోట్ల లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్న ఉప కాంట్రాక్టులు, పట్టిసీమ విన్యాసాలు ఇప్పటికే చాలామందిలో అసంతృప్తిని రగులుస్తున్నాయి. ఇప్పుడు రాజధాని భూములు. రాజధాని నిర్మాణానికి శివరామకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికను పక్కనబెట్టి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి ఆ ప్రభుత్వానికి ఆ హక్కు ఉంది. కానీ హైదరాబాద్‌లో చేసిన తప్పే మళ్లీ చేయవద్దని, రాజధాని అమరావతిలోనే అన్నీ కేంద్రీకరించి మిగతా ప్రాంతాలను నిర్లక్ష్యం చేయవద్దని, పరిపాలనా రాజధాని ఒకచోట, హైకోర్టు, పరిశ్రమలు, సాంకేతిక నగరం తదితరాలు వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసి అభివృద్ధిని వికేంద్రీకరించాలని లోక్‌సత్తా రాజకీయంగా చెప్పిన సహేతుక మాటను కూడా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రత్యేక హోదాను అసెంబ్లీలో ప్రతిపాదించిన పార్టీగా లోక్‌సత్తా అందుకోసం పోరాటంలో ప్రభుత్వం ముందుండి చొరవ చూపాలని విజ్ఞప్తి చేసినా ముఖ్యమంత్రి లెక్కచేయలేదు. ప్రత్యేక హోదా ఆలస్యమవుతుందనుకుంటే కనీసం నూరుశాతం పారిశ్రామిక పన్ను రాయితీలు అడిగి యువతకు త్వరగా ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని పలు కార్యక్రమాల ద్వారా కోరినా ప్రభుత్వం కేంద్రీకృత పాలనకే మొగ్గుచూపింది. కేవలం రాజధాని ప్రాంతానికే పన్ను రాయితీలు అడిగి వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు అన్యాయం చేసింది. అంతా ముఖ్యమంత్రి చేతుల్లో కేంద్రీకృతమవటం, ఆయన ఓ రాచనగరంలాగా రక్షణకుడ్యాలున్న రాజధానిని నిర్మించే కార్యక్రమం మొదలెట్టటం, ఆయన పార్టీ వారు, మంత్రివర్గ సభ్యులు సైతం అధికారాన్ని అడ్డంపెట్టుకుని కోట్లు సంపాదించుకోవటం ఇవన్నీ నూతన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుని అయోమయంలోకి నెడుతున్నాయి. డబ్బు రాజకీయానికి తెలుగునాట నాంది పలికి, భారతదేశానికి అంటించిన చంద్రబాబు ఇప్పుడు దాన్ని మరింత పెంచి పోషించి చివరకు దాని చేతిలో బందీగా మారిపోయారు. పూర్వకాలం రాజుల్లాగా నేతలు వియ్యంకుల్లగా మారి, ప్రాంతాలవారీగా పంచుకుని, సమాచారాన్ని నియంత్రిస్తూ, తేడా వచ్చినప్పుడల్లా కులం కార్డులు తీస్తూ రాష్ట్రాన్ని నంజుకుంటున్నారు. కొద్దిమంది డబ్బున్నవాళ్లు, వాళ్ల వందిమాగధులు తప్ప అక్కడ జనహితం కోరే నాయకులు, అధికారులు, కార్యకర్తలు కరవయ్యారు. జగన్‌ని చూసి భయపడి చంద్రబాబుకి ఓటు వేస్తే, ఏదో అభివృద్ధి చేస్తాడని ఆశపడితే చివరికి ఇలా అవుతోందని పలువురు వాపోతున్నారు. డబ్బే రాజకీయం-ఎన్నికలు, అధికారమే సర్వస్వం, కుటుంబమే పార్టీ అయితే ఏం జరుగుతుందో ప్రస్తుత ఏపీ రాజకీయం పచ్చిగా నిరూపిస్తోంది. ఏపీలో రాజకీయ అవినీతిని ఇప్పుడున్న వ్యవస్థలో తక్షణం ఎవరూ నిరూపించలేకపోవచ్చు. కానీ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంని తలపించేలా అవినీతి మొదలైందక్కడ. కాంట్రాక్టులు, భూ దందాలు, ట్రాన్స్‌ఫర్ల ద్వారా దోపిడీలో అక్కడ తెదేపా అగ్రనేతలు వైఎస్ జగన్‌తో పోటీపడుతున్నారు. ఇంత జరుగుతున్నా రాజధాని భూ దందాపై విచారణకు చంద్రబాబు అంగీకరించటం లేదు. రాజధాని పేరుతో అన్నిటినీ ఒకే చోట కేంద్రీకరించటం వల్ల లక్షల కోట్ల డబ్బు లావాదేవీలు జరుగుతాయి. రియల్ ఎస్టేట్ దందా భారీగా జరుగుతోంది, పన్ను రాయితీలు వస్తాయంటున్నారు, నేరుగా విదేశీ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార వ్యవహారాలు నడుపుతోంది.. ఈ నేపథ్యంలో ఖచ్చితంగా అన్నిటినీ పారదర్శకంగా ప్రజలముందుంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అగ్రిగోల్డ్ భూములపై చంద్రబాబు బుకాయిస్తున్నారుగానీ, ఆ సంస్థ నుంచి తెదేపా ప్రభుత్వ నేతలకు ఇప్పటికే కోట్లు ముట్టాయని సంస్థలో ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారే చెబుతున్నారు. సంస్థ భూముల్ని క్రమంగా లాక్కునేందుకే అగ్రనేతలు ప్రయత్నిస్తున్నారంటున్నారు. ప్రభుత్వ విచారణ తీరుని హైకోర్టు కూడా తప్పుపట్టింది. రాజధాని భూముల్లో అవినీతి లేనప్పుడు, ఇన్ని లక్షల కోట్ల దందాపై ఏమాత్రం అనుమానాలకు తావులేకుండా ముఖ్యమంత్రి ఎందుకు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించటం లేదు? న్యాయపర్యవేక్షణలో పూర్తిస్థాయి సర్వేకు ఎందుకు అభ్యంతరం? ఇలాంటి ఏర్పాటు వల్ల ముందు అవినీతికి కూడా ఆస్కారం లేకుండా ఉంటుంది. ఇవన్నీ వదిలేసి జగన్ పత్రిక ప్రజల ఆస్తి అని, సత్యం కంపెనీలా వేరేవారికి అప్పచెబుతామని అంటున్నారు. అంటే, ఇక ఆ పత్రికలలో కూడా ప్రభుత్వ అనుకూల వార్తల్నే రాయిస్తారన్నమాట.



# చంద్రబాబు అమరావతి కేంద్రీకరణ అవినీతి కేంద్రీకరణ కోసమే, భూములపై న్యాయపర్యవేక్షణలో పూర్తిస్థాయి బహిరంగ సర్వే జరపాలి: లోక్‌సత్తా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి అమరావతి కేంద్రీకరణ అవినీతి కేంద్రీకరణ కోసమేనని, రాజధాని నిర్మాణం చుట్టూ భూ కుంభకోణాలే అందుకు తిరుగులేని నిదర్శనమని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. అభివృద్ధిని, అధికారాన్ని వికేంద్రీకరించాలని లోక్‌సత్తా పలుమార్లు చెప్పినా, అంతా అమరావతిలోనే అంటూ చంద్రబాబు సర్కారు సాగిస్తున్న కేంద్రీకృత పాలన ఎందుకోసమో, ఎవరికోసమో ఇప్పుడు రుజువవుతోందన్నారు. రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తుని పరిరక్షించటం కోసం లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆనాడు అసెంబ్లీలో ప్రత్యేక హోదాను ప్రతిపాదిస్తే, దాన్ని చంద్రబాబు ఎన్నికల్లో వాడుకుని ఇప్పుడు తెలుగు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా ఆలస్యమైతే కనీసం వెంటనే రాగల పారిశ్రామిక పన్ను రాయితీల్ని రాష్ట్రానికి తీసుకురండి బాబూ అని పలుమార్లు లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తే, చివరికి వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమను వదిలేసి కేవలం రాజధాని ప్రాంతం వరకే పన్ను రాయితీల్ని ఢిల్లీలో చంద్రబాబు అడిగారన్నారు.

"చంద్రబాబు గారూ! అంతా అమరావతే, ఇక మిగిలిన జిల్లాలు అక్కర్లేదని రాజధానికే పన్ను రాయితీలు అడిగారు. అక్కడైనా పన్ను రాయితీలు ఏమేరకు అమలు జరుగుతున్నాయో చెప్పగలరా?

అమరావతి ప్రాంతంలో చట్టప్రకారం భూసేకరణ జరిగిందని చెప్పగలరా?

భూములిచ్చిన రైతులను చట్టప్రకారం ఎలా ఆదుకుంటారో స్పష్టమైన వివరాలు ఇవ్వగలరా?

రాజధాని భూసేకరణలో ల్యాండ్ సీలింగ్ చట్టం ఉల్లంఘన జరగలేదని ఖచ్చితంగా చెప్పగలరా?" అని బాబ్జీ ప్రశ్నించారు.

**అది ప్రభుత్వమా? దొంగలముఠానా?**

రాజధాని చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచుకోవటంలో చంద్రబాబు ఆరితేరిపోయారన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు ఒక పథకం ప్రకారం అక్కడ భూములు కొనుగోలు చేసి భారీ రేట్లను సృష్టించి ప్రచారం చేసి కోట్లు లబ్ధి పొందారని, ఇదంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగిందని బాబ్జీ అన్నారు. అమరావతి అవినీతి కథల్ని చూస్తుంటే అది ప్రభుత్వమా? దొంగలముఠానా? అనే సందేహం కలుగుతోందన్నారు. "ఒక్కో నియోజకవర్గానికి రూ. 30-40 కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచిన నేతలు దండుకోక ఏంచేస్తారు? అలాంటి రాజకీయాన్ని ప్రోత్సహించిన మీరు వాళ్లకేం చెప్పగలుగుతారు చంద్రబాబు గారూ?" అని ఎద్దేవా చేశారు.

> **ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిపై ఏ విమర్శలు చేశారో, ఏ దుర్మార్గపు, దివాళాకోరు కంపెనీలకు కాంట్రాక్టులిస్తున్నారని ఆరోపణలు చేశారో అవే పనుల్ని ఇప్పుడు తాను చేస్తున్నారని, అవే కంపెనీలకు కాంట్రాక్టులిస్తున్నారని**

**వైఎస్‌పై చేసిన విమర్శలే ఇప్పుడు చంద్రబాబు విధానాలు, నాడు దుర్మార్గమన్న కంపెనీలకే ఇప్పుడు కాంట్రాక్టులు**

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డిపై ఏ విమర్శలు చేశారో, ఏ దుర్మార్గపు, దివాళాకోరు కంపెనీలకు కాంట్రాక్టులిస్తున్నారని ఆరోపణలు చేశారో అవే పనుల్ని ఇప్పుడు తాను చేస్తున్నారని, అవే కంపెనీలకు కాంట్రాక్టులిస్తున్నారని బాబ్జీ అన్నారు.

ఇంకెన్నాళ్లు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తారు చంద్రబాబూ? అమరావతి భూముల సేకరణపై న్యాయపర్యవేక్షణలో పూర్తి స్థాయి బహిరంగ సర్వే చేయించండి అని భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు.


అభివృద్ధి మొత్తం అమరావతిలోనే
కేంద్రీకరించి హైదరాబాద్ లో చేసిన
తప్పే మళ్ళీ చేయొద్దు !
SINGAPORE
అభివృద్ధి ని అన్ని జిల్లాల్లో వికేంద్రీకరించండి !
సచివాలయం ఒక చోట ,ఆర్థిక రాజధాని
మరోచోట , హై కోర్ట్ ఇంకోచోట , పరిశ్రమలు
వేరు వేరు చోట్ల ఏర్పాటు చేస్తే ఆంధ్ర ప్రదేశ్
దేశం లోనే అగ్రగామి గా నిలుస్తుంది .
షేర్ చెయ్యండి
ప్రభుత్వాన్ని మేలుకొల్పండి
LOKSATTA PARTY

Posting Date 22-03-2016

RNI.Reg. No. APTEL/2010/32219    Postal Reg. No. HD/1126/2016-18    Published on March 16th 2016







**ఒకరేమో మంత్రి పుత్ర రత్నం**

**మరొకరు ప్రజా ప్రతినిధి , ఒక ఆడపిల్లకి తండ్రి , సినిమాల్లో స్త్రీ శక్తి గురించి గుక్క తిప్పుకోకుండా ఉపన్యాసాలు ఇచ్చేస్తారు. NTR వారసుడు, సాక్షాత్తు ముఖ్యమంత్రి వియ్యంకుడు !**

Book-Post

PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad